ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

శుక్రవారం 13 డిసెంబరు 2024



5

డాగ్.. డయాబెటిస్

- కుక్కల్లో ప్రబలుతున్న షుగర్ వ్యాధి
- 1 నుంచి 5 శాతానికి పెరుగుదల
- మితిమీరిన ఆహారమే కారణమంటున్న వైద్యులు

8





రిజిస్ట్రేషన్ చార్జీలో భారీ మినహాయింపు

పన్నుల్లో రాయితీలతో ప్రభుత్వ ప్రోత్సాహం

చార్జింగ్ స్టేషన్ల పెట్టుబడిలో 25 శాతం రాయితీ

విద్యుత్ రవాణా పాలసీ 4.0తో పండుగే పండుగ

ఇక ఈవీల హవా

విద్యుత్ వాహనాలకు వరాలు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత వాహనాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రవాణా పాలసీని ప్రకటించింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు విద్యుత్ వాహనాల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ఈవీ వాహనాలు ధర అధికంగా ఉన్నా పర్యావరణం, పెట్రోలు ధరల భారంతో పలువురు ఈవీ వాహనాలను పెద్దసంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 ప్రకటించింది. విద్యుత్ వాహనాల వినియోగదారులు, చార్జింగ్ స్టేషన్ నిర్వాహకులకు ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. దీంతో విద్యుత్ వాహనదారులకు పండుగే.. పండుగని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ వాహనాల వినియోగంలో రాష్ట్రం వెనుకంజలో ఉండటంతో వాటిని ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తాజాగా రూపొందించిన విద్యుత్ రవాణా పాలసీ ద్వారా 2029 నాటికి 2 లక్షల విద్యుత్ టూ వీలర్స్, 10 వేల త్రీ వీలర్స్, 20 వేల ఫోర్ వీలర్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఔత్సాహిక ఎంఎస్ఎంఈ పెట్టుబడిదారులకు పెట్టుబడిలో 35 శాతం రాయితీ, ఇంటెన్సివ్‌లు ప్రకటించింది. క్వాలిటీ సర్టిఫికేషన్, విద్యుత్ సుంకం కూడా రీయింబర్స్ చేస్తారు. విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ఒక్కో పబ్లిక్ చార్జింగ్ స్టేషన్‌కు పెట్టుబడిలో 25 శాతం సబ్సిడీ, గరిష్ఠంగా 3 లక్షలు ఇస్తారు.

● వినియోగదారులకూ రాయితీ..

విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసే వినియోగదారులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలో మినహాయింపు ఇచ్చింది. 12 శాతంగా ఉన్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయిస్తోంది. అంటే రూ.లక్ష వాహనానికి రూ.12 వేలు లైఫ్ టాక్స్ మినహాయింపు వస్తుంది. దీంతో పాటు వాహన ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. కార్లకు మాత్రం ఇది వర్తించదని సమాచారం. రూ.లక్ష లోపు ఉన్న ఈ-ద్విచక్ర వాహనాలకు, రూ.2 లక్షల లోపు ధర ఉన్న ఈ-3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ-రవాణా వాహనాలకు, రూ.8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ.2 కోట్ల లోపు ధర ఉన్న ఈ-బస్సులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. అమ్మకందారులకు కూడా పది శాతం రాయితీ ప్రకటించారు.

● ప్రతి 30 కి.మీ.కి ఒక చార్జింగ్ స్టేషన్

ప్రధాన రహదారుల్లో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం పాలసీ లక్ష్యం. నగరాల్లో 3 బై 3 కేఎం గ్రిడ్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ మొబిలిటీ సిటీల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కార్పస్ ఫండ్‌గా కేటాయించింది. ఈ మొబిలిటీ స్టార్టప్‌ల కోసం 100 ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది.

మందులు ఏటిపాలు

ప్రాణాపాయ మందులు.. రోగుల నీరసం పోగొట్టే బలం సిరప్‌లు.. వివిధ రోగాలకు సంబంధించిన ట్యాబ్లెట్లు.. జగనన్న ఆరోగ్య సురక్ష, కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్ కిట్లు.. ఏటిపాలు చేశారు. ప్రైవేటు దోపిడీని తట్టుకోలేక ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే పేదలకు ఇవ్వాల్సిన మందులు నదిలో పారేశారు. పేదల కోసం రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన మందుల్లో చాలావరకు చెత్తకుప్పల్లో దర్శనమిస్తున్నాయి. రోగులకు ఇవ్వడానికి చేతులు రాదు కానీ ఇలా పారేయడం ఏమిటని ఆ మందుల గుట్టలను చూసిన పలువురు విస్తుపోతున్నారు. బయో వ్యర్థాల కింద అప్పగిస్తే దొరికి పోతామనుకున్నారో! లేక నదిలో పారేస్తే ప్రవాహంలో కొట్టుకు పోతాయనుకున్నారో కానీ, పెద్దగుట్ట మందులను కృష్ణానదిలో వేశారు. ఈ మందుల గుట్టలపై ప్రశ్నిస్తే ఆస్పత్రులు, 104 సిబ్బంది మావికాదంటే మావికాదంటూ చెప్తూ కృష్ణాజిల్లా వారు పారేసి ఉంటారని నెపం మోపుతున్నారు. ఈ మందుల్లో కొన్ని గడువు తీరిపోగా.. మరికొన్ని 2025 వరకు గడువు ఉన్నాయి. ఇటీవల తెనాలి అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలోనే మందులకు నిప్పు పెట్టగా తాజాగా నది మధ్యలో గుట్టలు గుట్టలుగా విలువైన ఔషధాలు దర్శనమివ్వడంపై ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

- 2025 వరకు గడువున్నా పారేశారు
- కృష్ణానదిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు
- ఓ తంతుగా ఆరోగ్య శిబిరాలు.. మందులన్నీ వృథా
- పేద రోగులకు ఇవ్వకుండా పారేయడంపై విమర్శలు
- గడువు ముగిసే సమయంలో కొనుగోలుపై అనుమానాలు
- మావికాదంటే.. మావికాదంటున్న పీహెచ్‌సీ, 104 సిబ్బంది

తెనాలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి ఔషధ కంపెనీల దగ్గర కొని ప్రభుత్వం అందించిన మందులవి. 104లో అందించాల్సినవో! లేక పీహెచ్‌సీల నిర్వాకమో కానీ, కొన్ని గడువు తీరాక.. మరికొన్ని 2025 వరకు గడువున్నా కృష్ణానదిలో పారేశారు. వాటితోపాటే జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, గుండె సంబంధ మందులు, ర్యాపిడ్ టెస్ట్ కిట్లు వంటివి కూడా ఆ చెత్త గుట్టలో ఉన్నాయి. కొల్లిపర మండలం మున్నంగి ఇసుక రీచ్ కోసం నదిలోకి గాలు వేసి ఉంది. ఆ గాలు మార్గంలోని చెత్త కుప్పల్లో ఈ మందులు కూడా ఉన్నాయి. 2024 మేతో గడువు ముగిసిన మందులు ఎక్కువగా ఉంటే, 2025 వరకు గడువున్న మందులు కూడా ఆ గుట్టలో ఉన్నాయి. కొల్లిపర, మున్నంగి ప్రభుత్వ వైద్యశాల సిబ్బందితో పాటు 104 వాహన సిబ్బంది మావి కాదంటే మావికాదంటున్నారు. ఇటీవల తెనాలి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గడువు ముగిసిన మందులను ఆస్పత్రి ఆవరణలోనే నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు కృష్ణానదిలో వివిధ రకాల మందులు ప్రత్యక్షం కావడం చూస్తే గత ప్రభుత్వ హయాంలో పేదల వైద్యంపై ఎంతవరకు శ్రద్ధ చూపారనేందుకు నిదర్శనంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే రోగులకు మందులు ఇస్తే వారి ఆరోగ్యం కుదుటపడటంతోపాటు, ఆర్థికపరంగా కూడా వెసులుబాటు ఉంటుంది. కానీ కొన్ని వైద్యశాలల్లో వైద్యులే పేద రోగులకు ప్రైవేటు దుకాణాల్లో మందులు తెచ్చుకోవాలని రాస్తున్నారు. వివిధ రకాల రక్త పరీక్షల కేంద్రాలకు కూడా పంపిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే మందులు, పరీక్షల కిట్లను మాత్రం ఇలా పారేస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శిబిరాలు ఓ తంతుగా మారడంతో విలువైన మందులన్నీ వృథాగా మారాయి. ఆస్పత్రులకు ప్రభుత్వం సరఫరా చేసే మందుల్లో ఏదో ఒకటి, రెండు రకాల

(మిగతా 6వ పేజీలో)





మున్నంగి ఇసుక రీచ్ మార్గంలో కృష్ణానది మధ్యలో పారేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, వివిధ రకాల మందులు

- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో కీలక నిర్ణయాలు
- అనేక అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం
- గోదావరి జలాల ఎత్తిపోతల పథకం నిర్మాణంలో కదలిక
- పల్నాడులో 466 ఎకరాల భూసేకరణకు చంద్రబాబు ఆదేశాలు
- గుంటూరు యూజీడీ పెండింగ్ నిధుల విడుదలకు నిర్ణయం
- ఏఐఐబీ పనుల కొనసాగింపుపై నివేదించిన కలెక్టర్ నాగలక్ష్మి
- కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళికల రూపకల్పనపై నిర్ణయం

సమీక్షలు... ఆదేశాలు



సదస్సుకు హాజరైన బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ



నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తిపోతల పథకానికి నాడు సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వివిధ అంశాలపై సమీక్షలు.. ఆదేశాలు.. సూచనలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు.. ఇదీ రాజధాని సచివాలయంలో గురువారం జరిగిన కలెక్టర్ల రెండు రోజు సదస్సు జరిగిన తీరు. నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులకు తీపి కబురు చెప్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో గోదావరి జలాల ఎత్తిపోతల పథకంపై నిర్ణయం తీసుకున్నారు. పైగా ఈ పథకాన్ని 2026 జూన్ కల్లా పూర్తి చేస్తామని ప్రకటించారు. రెండో రోజు సదస్సులో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు, బాపట్ల కలెక్టర్ వెంకటమురళిలు ఆయా జిల్లాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రికి నివేదించగా, వాటిపై ప్రత్యేకంగా చర్చించారు. గుంటూరు నగరానికి సంబంధించి గతంలో ఆగిపోయిన యూజీడీకి పెండింగ్ నిధులు మంజూరుకు సీఎం ఆమోదం తెలపగా నగరపాలక సంస్థలో ఏఐఐబీ ప నుల కొనసాగింపుపై కలెక్టర్ నాగలక్ష్మి సీఎంకు ప్రత్యేకంగా నివేదించారు. స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లపై విస్తృతంగా చర్చ జరగడంతో పాటు జిల్లా వ్యాప్తంగా అది సాకారం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎం కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. గురువారం నాటి కలెక్టర్ల సదస్సులో గోదా వరి - పెన్నా నదుల అనుసందానంపై ప్రధానంగా చర్చ జరిగింది. సాగర్ అయకట్టుకు గోదావరి జలాల తరలింపు పథకానికి భూసేకరణకు కలెక్టర్ల సదస్సులో సీఎం ఆదేశాలిచ్చారు. దీంతో ఈ ఎత్తిపోతల పథకం పనులకు త్వరలో కదలిక రానున్నది. ఎత్తిపోతలకు సంబంధించిన రెండు పంపుహౌస్‌ల పనులు పురోగతిలో ఉండగా మరో మూడు పంపుహౌస్‌ల పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇక గుంటూరుకు సంబంధించి యూజీడీ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని కలెక్టర్ నాగలక్ష్మి సీఎంకు నివేదించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ స్కీమ్ మంజూరు కాగా దాదాపుగా రూ.500 కోట్లు ఖర్చు చేశామని అయితే రాష్ట్ర ప్రభుత్వ, నగరపాలకసంస్థ వాటా రూ.400 కోట్ల వరకు ఉన్నదని పెండింగ్ నిధుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ కోరారు. దీనిపై సీఎం స్పందించి ఆర్థికశాఖ వద్ద పెండింగ్ బిల్లులు ఎంత మొత్తంలో ఉన్నాయనేది తెలుసుకున్నారు. దాదాపుగా రూ.300 కోట్లు త్వరలోనే విడుదల చేసి యూజీడీ స్కీమ్‌ని పూర్తి చేయాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో తాగునీటి సరఫరా సమస్యలను కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎంటీఎంసీ పరిధిలో హైరైజ్డ్ బిల్డింగ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, అపార్టుమెంట్లు వచ్చేశాయని, అయితే వారంతా భూగర్భ జలంపైనే ఆధారపడి ఉన్నారని చెప్పారు. గుంటూరు నగరంలోకి

(మిగతా 8వ పేజీలో)

6

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

జనసేన నేతపై వైసీపీ సర్పంచి దాడి

దాల్ మిల్లులో చోరీని ఛేదించిన పోలీసులు

- రూ 4.35 లక్షల నగదు రికవరీ

మేడికొండూరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

- 98 సర్వీసులకు రూ.5.13 లక్షల జరిమానా

దళారులను నమ్మి మోసపోవద్దు

- కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకోవాలి
- ధాన్యం రైతులకు జేసీ ప్రఖర్‌జైన్ సూచన

నగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యాన్ని అమ్ముకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. గురువారం మండలంలోని పూడివాడ గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం రైస్ మిల్లర్లతో మాట్లాడి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులను ప్రశ్నించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ ఉండాలని మిల్లర్లకు జేసీ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై రామకృష్ణ, ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ జీ నాంచారయ్య, మండల వ్యవసాయశాఖాధికారి రమేష్‌బాబు, టీడీపీ నాయకులు కాసాని శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

కదిలిన చోరీ డొంక

- అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

చీరాలటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చీరాలలో జరిగిన చోరీపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు ట్రాక్ రికార్డు చూసి నివ్వెరపోయారు. చిన్నపాటి దొంగగా భావించి దర్యాప్తు చేపడితే ఏకంగా చోరీ డొంకే కదిలింది. చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామానికి చెందిన కస్తూరి అప్పన్న అలియాస్ వీరప్పన్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పలు చోరీలకు పాల్పడ్డాడు. దీంతో ఇతడిపై ఇప్పటికే సుమారు 72 కేసులు నమోదయ్యాయి. ఇటీవల బాపట్ల పరిధిలో జరిగిన చోరీ కేసులో సబ్ జైలు నుంచి విడుదలైన వీరప్పన్న చీరాల మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు కేసు దర్యాప్తులో ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. అతడి వద్ద నుంచి 5 కేసులకు సంబంధించిన రూ.7.41 లక్షల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కమలాకర్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

ఆర్టీసీలో ఓడీలపై డీపీటీవో సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ గుంటూరు జిల్లా పరిధిలోని డిపోల్లో ఓడీ (అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్)లపై జిల్లా ప్రజారవాణాధికారి ఎమ్ .రవికాంత్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గుంటూరు-1,2 డిపోలతోపాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లో కొందరు ఉద్యోగులు అక్రమంగా ఓడీలు పొందుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ 'ఓడీలతో ఎంజాయ్' శీర్షికన ఈ నెల 6న 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో కథనం ప్రచురితమైంది. దీనికి డీపీటీవో స్పందించారు. డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విభజిత జిల్లా వ్యాప్తంగా ఐదు డిపోల్లో 51 మంది అక్రమంగా ఓడీలు పొందుతున్నట్లు సమాచారం. అక్రమ ఓడీలపై ఆయన స్పష్టత తీసుకున్నారు. ఇందులో అత్యధికంగా గుంటూరు-2తో పాటు గుంటూరు-1లో ఉన్నట్లు గుర్తించారు. అంతేగాక పొన్నూరులో కూడా ఓ ఉద్యోగిపై ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఇలా అక్రమంగా ఓడీలు పొందుతోన్న వారిని తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. అర్హుల అర్జీలను బుట్టదాఖలు చేసి అనర్హులకు ఓడీలు మంజూరుపై కూడా విచారణ జరుపుతున్నారు. అక్రమ ఓడీలను ఒకటి, రెండు రోజుల్లో రద్దు చేయాలని డీపీటీవో నిర్ణయానికి వచ్చారు.

కొత్త రసాయన చర్యల ఆవిష్కరణ సాధ్యమే



విద్యార్థులతో ఆచార్య ఏటీ బిజు

గుంటూరు(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్గానో క్యాటలిసిస్ ద్వారా అనేక కొత్త రసాయన చర్యలను ఆవిష్కరించడం సాధ్యమవుతుందనీ, అంతేకాకుండా ఇవి పరిశోధనలో పురాతన మార్గాలను తెరవగలవని ఐఐఎస్‌సీ బెంగళూరు ఆచార్య ఏటీ.బిజు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో గురువారం ఆయన మాట్లాడారు. ఆచార్య ఏటీ.బిజు మాట్లాడుతూ ఆర్గానోక్యాటలిసిస్ అనేది ఒక ప్రత్యేకమైన రసాయన పద్ధతి అని, ఇది పరిశోధన, పరిశ్రమల్లో అనేక రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి భోపాల్‌లోని ఐఐఎస్‌ఈఆర్ ప్రొఫెసర్ నితిన్ టి.పాటిల్ మాట్లాడుతూ రసాయన శాస్త్రం పరిశోధనల్లో రోజురోజుకు వినూత్న అభివృద్ధి చెందటంతోపాటు ఔషధ తయారీ,సేంద్రియ రసాయన శాస్త్రం, మెటీరియల్స్ సైన్స్ మధుమేహం వ్యాధులకు సంబంధించి మందులను రూపొందించడంలో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ ఎస్.భాస్కర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ జి.శేఖర్, ఎన్ఐటీ వరంగల్ నుంచి డాక్టర్ సి.రఘు, వివిధ దేశాల ప్రతినిధులు, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా (డైక్ సెంటర్‌లో) మెడికల్ ఆఫీసర్, డెంటల్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, సోషల్ వర్కర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలను జిల్లా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబరు 30 లోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అందజేయాలని ఆమె కోరారు. రిజిస్టర్ పోస్ట్ ద్వారా కూడా దరఖాస్తులు పంపుకోవచ్చన్నారు.

ఉపాధ్యాయుడు అరెస్టు

కొల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కిష్కిందపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న వల్లభనేని వెంకటేశ్వరరావు బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఉపాధ్యాయుడు డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు ఎదుట లొంగిపోవడంతో నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూలిక వైద్యంపై పరిశోధనలు రావాలి

- ఇంఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి
- ముగిసిన రెండు రోజుల ఫార్మసీలో జాతీయ సదస్సు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఇంఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

పెదకాకాని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కాపాడటం కోసం మూలిక వైద్యంలో విస్తృత పరిశోధనలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి సూచించారు. వర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో రెక్టార్ రత్నషీలామణి మాట్లాడుతూ ఔషధాలు కనుగొనడంలో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వృత్తి పట్ల నిబద్ధత ఉండటంతో ప్రజారోగ్యం ఆ మేరకు సంతృప్తికరంగా ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా విషతుల్యత లేని ఔషధాలను కనుగొనేందుకు విస్తృత పరిశోధనలు చేయాలని సూచించారు. ఉదయం జరిగిన ప్లీనరీ సెషన్‌లో ఆచార్య గురువాయూరప్పన్ మాట్లాడుతూ క్యాన్సర్ నివారణలో నూతన ఆవిష్కరణలు, క్యాన్సర్ రోగులు ఎదుర్కొనే ఇతర ఇబ్బందులను నివారించడానికి తాను చేసిన పరిశోధనలో సత్ఫలితాలు వస్తున్నాయని విద్యార్థులకు వివరించారు. హైదరాబాదులోని నల్ల నరసింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డీన్ ఆచార్య సీహెచ్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తన పరిశోధనలో ప్రీ క్లినికల్ ల్యాబ్ అనుభవాలను వివరించారు. ఒక వైద్యుడు తప్పు చేస్తే ఒకరు, ఇద్దరు రోగులు మరణిస్తారనీ, అదే ఒక ఫార్మాసిస్టు వలన తప్పు జరిగితే కొన్ని వందల మంది ఇబ్బందులు పడతారని తెలిపారు. ఫార్మసిస్టులు కనుగొనే ఔషధాలు సమాజ రుగ్మతలను ఎదుర్కొనే విధంగా ఉండాలని సూచించారు. అనంతరం జరిగిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, రెండు, మూడో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీఓఎస్ ఛైర్మన్, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.విద్యాధరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ. ప్రమీలారాణి తదితరులు మాట్లాడారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ పోస్టర్ ప్రజెంటేషన్లకు 137 మంది పాల్గొనగా రెండు రోజుల జాతీయ సదస్సులో వివిధ యూనివర్సిటీలు, కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు.

దాల్ మిల్లులో చోరీని ఛేదించిన పోలీసులు

- రూ 4.35 లక్షల నగదు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావు

నాదెండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దాల్ మిల్లులో జరిగిన చోరీని పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ 4.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గణపవరం గ్రామ పరిధిలోని ఏఎంజీ ఎదురుగా ఉన్న డొంకలో గల విజయ వాసవి దాల్ అండ్ రైస్ మిల్లు వారు ప్రతి రోజూ అమ్మకాలకు సంబంధించి నగదును బ్యాంకులో జమ చేస్తారు. శుక్రవారం వచ్చిన నగదును సమయం కుదరక సోమవారం వరకు బీరువాలోని లాకర్‌లో ఉంచారు. మంగళవారం రూ.4.35 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. మిల్లు భాగస్వామిదారుడు కనకం లక్ష్మయ్య నాదెండ్ల ఎస్‌ఐ పుల్లారావుకు చోరీ విషయంపై ఫిర్యాదు చేశారు.

ఏసీ రూమ్‌నే టార్గెట్‌గా....

గుంటూరులోని శారదా కాలనీకి చెందిన నిందితుడు మిక్కిలి సందీప్ వ్యసనాలకు బానిస అయ్యాడు. ఈ క్రమంలో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఏసీ రూమ్‌లే టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇదే తరహాలో చోరీ చేశాడు. ఈ క్రమంలో దాల్ మిల్లు ఏసీ రూమ్ తాళాలు పగలగొట్టి బీరువాలోని నగదును చోరీ చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూరల్ సీఐ సుబ్బయ్య నాయుడు దర్యాప్తు చేపట్టారు. ఎస్‌ఐ పుల్లారావు, ఏఎస్‌ఐ రోసిబాబు, కానిస్టేబుళ్లు ఇర్మియా, అశోక్ బృందాలుగా ఏర్పడి నిందితుడి ఆనవాళ్లను గుర్తించారు. గణపవరంలో ఉన్న అతన్ని చాకచక్యంగా అరెస్టు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతనిపై ఏడు కేసులు ఉన్నాయని చిలకలూరిపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారని ఆయన వివరించారు. కాగా నాదెండ్ల పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ నాగేశ్వరరావు సందర్శించి రికార్డులు పరిశీలించారు.

మందులు.. ఏటిపాలు

(5వ పేజీ తరువాయి)

మందులు మిగిలిపోయినా, వాటిని పారేశారంటే అర్థం ఉంటుంది. కరోనా తర్వాత వస్తున్న రోగాలకు తగ్గ మందులన్నీ ఉన్నా, అవన్నీ మిగిలిపోవడం విడ్డూరమే. పారాసిట్‌మాల్, ఇతర యాంటీబయోటిక్స్, విటమిన్ డీ 3, గ్యాస్, షుగర్, బీపీ వంటి నిత్యావసర మందులు కూడా నదిలో పారేసిన వాటిలో ఉండటం విశేషం. ఇకటి, రెండు పీహెచ్‌సీల పరిధిలోనే ఇన్ని మందులు గడువు ముగిసిపోయినవి ఉంటే, రాష్ట్రం మొత్తం మీద ఇంకెన్ని ఉంటాయనేది ఆందోళన కలిగించే విషయం. బలానికి సంబంధించి, ఐరన్ వంటి పోషక విలువలు తగ్గిన వారికి ఉపకరించే విటమిన్ ట్యాబ్లెట్లు కూడా వృథా చేశారు. ఖరీదైన ఇంజక్షన్లు కూడా పారేసిన వాటిలో దర్శనమిస్తున్నాయి. చివరకు చిన్న పిల్లలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు కూడా ఉపయోగించలేదంటే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఈ మందులను ప్రభుత్వం సరఫరా చేసిన తర్వాత రెండు వేసవి సీజన్లు వచ్చాయి. ఆ సమయంలో డీహైడ్రేషన్‌తో ఆస్పత్రి పాలైన వారు ఎందరో ఉన్నారు. వారికి ఉపయోగపడే ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా నదిలో పారేశారు. ఇక నిరోద్ ప్యాకెట్లను కూడా పారేశారు.

సురక్ష అమల్లో నిర్లక్ష్యం

జగన్ ప్రభుత్వ కాలంలో పేదల కోసం అంటూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారు. 2023 సెప్టెంబరులో సర్వే, మెడికల్ క్యాంపులు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నారు. దీనిలో వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ రెండుసార్లు తిరిగి, సర్వే, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలి. దీనికోసం 104 వాహనాన్ని ఉపయోగించుకున్నారు. చికిత్స అవసరం అనుకుంటే శిబిరాల్లో పరీక్షించి, మందులు అందేలా చూడాలి. అయితే ఇవేమీ అన్నిచోట్ల ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం జరగలేదు. దీంతో మందులన్నీ మూలన పడేశారు.

పైగా 2023లో పథకం అమలు జరిపితే, దానికి అవసరమైన మందులను 2022 చివరలో తయారు చేసినవి సరఫరా చేశారు. అవికూడా 2023, 2024 సంవత్సరంలో గడువు పూర్తయ్యే సమయంలో వాటిని నాటి ప్రభుత్వం కొనుగోలు చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోనీ వాటినైనా గడువు ముగిసేలోపు రోగులకు అందించారా అంటే అదీ జరగలేదు. జ్వరం, యాంటీబయోటిక్స్ ట్యాబ్లెట్లు అందించలేకపోయారంటే ఏదో సాకు చెప్పవచ్చు. కానీ వాక్సిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కోవిడ్ ర్యాపిడ్, మలేరియా ర్యాపిడ్ టెస్ట్‌ల కిట్లు కూడా ఏటిపాలు చేశారంటే ఈ పథకం అమలులో ఎంత నిర్లక్ష్యం రాజ్యమేలిందనేది అర్థమవుతుంది. గడువు ఉన్నప్పుడు ప్రాణాలు కాపాడే మందులు గడువు తీరాక విషంతో సమానం. ఇటువంటి ప్రమాదకర పరిస్థితులు కలిగించే మందులను, సెలైన్ సీసాలను కూడా నదిలో పారేయడం దారుణం. అవి నదిలో కొట్టుకుపోయి నీటిలో కలిసి ఆ నీరు కలుషితమవుతుంది. వాటిని తాగే జంతువులు, మనుషులు నది, సముద్ర జీవులకు హాని కలిగే అవకాశం ఉంది. అయినా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా మందులను నదిలో పారేయడంపై సమీప గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ నాయకులకు మాట్లాడే నైతిక అర్హత లేదని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడును సర్వనాశనం చేసిన దొంగలంతా మళ్లీ ఒక గూటికి చేరారని విమర్శించారు. అరాచకాలు, దుర్మార్గాలతో పాలన సాగించిన వైసీపీ నేతలు నేడు మళ్లీ ఏకమయ్యారని అన్నారు. ఇసుక, మైనింగ్ దోపిడీల నుంచి కబ్జాల వరకు ఐదేళ్లలో చేయని దుర్మార్గాలు లేవనీ, కోట్లు రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. అరాచకాలు, హత్యలు, దోపిడీలు భరించలేకనే గత ఎన్నికల్లో పల్నాడు జిల్లాల్లోని ఏడుగురు ఎమ్మెల్యేలను ప్రజలు ఇంటికి పంపించారనీ, అయినా వారి ప్రవర్తనలో మార్పు లేదని దుయ్యబట్టారు. రాక్షస పాలనపై తిరుగుబాటు తీవ్రతను రాష్ట్రం మొత్తానికి పల్నాటి ప్రజలు తెలియజేశారన్నారు. ప్రజలను ఐదేళ్లపాటు భయభ్రాంతులకు గురిచేసి ఇప్పుడు ఏం మాట్లాడుతున్నారో అందరూ గమనిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేసి ఇప్పుడు దొంగేదొంగ అని అరిచినట్లు కూటమిపై ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. వైసీపీ మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని అన్నారు.

రేపు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక ఈ నెల 14న స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల తరపున వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతాయని జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ ఎం సుబ్బరాజు గురువారం తెలిపారు. ఎంపికకు హాజరు అయ్యే క్రీడాకారులు 20 సంవత్సరాల లోపు వయస్సు, 70 కేజీల లోపు బరువు ఉండాలన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 22 నుంచి 25 వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అదనపు సమాచారం కోసం పీడీ రాయల ఆంజనేయులు 9063577055 నంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు అన్నారు.

పేరేచర్లలో భలే చికెన్ బేరం



చికెన్ కోసం ఎగుబడుతున్న స్థానికులు

మేడికొండూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో చికెన్ కోసం గురువారం షాపుల ముందు జనం బారులు తీరారు. భలే మంచి చౌక బేరమంటూ స్థానికులు చికెన్ కోసం ఎగబడ్డారు. సహజంగా చికెన్ కోసం షాపుల వద్దకు ఆదివారం ఎక్కువ మంది వెళ్తుంటారు. అందుకు భిన్నంగా గురువారం చికెన్ కోసం బారులు తీరడం విశేషంగా చెప్పుకుంటున్నారు. దీనికి కారణం చికెన్ ధర తగ్గించి అమ్మడమే. పేరేచర్లలో నూతనంగా చికెన్ షాపు పెట్టారు. ప్రారంభ ఆఫర్‌గా చికెన్ ధరను కిలో వంద రూపాయలుగా ప్రకటించారు. ఇంకేముంది తమ వ్యాపారం ఎక్కడ దెబ్బతింటుందోనని మిగతా షాపుల వాళ్లు కూడా ఇదే ధరకు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయం అందరికీ తెలియడంతో ఒక్కసారిగా జనం షాపుల వద్దకు చేరుకొని క్యూలో నిలబడి చికెన్ కొనుగోలు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

ముప్పాళ్ళ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మూడు వందల గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ సోమేశ్వరరావు గురువారం తెలిపారు. బుధవారం ముప్పాళ్ళలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకొని విచారించామని, దీంతో వారు గంజాయి అమ్ముతున్నట్టుగా గుర్తించామన్నారు. ముప్పాళ్ళకు చెందిన పఠాన్ చాంద్ బాషా, కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన బత్తుల నరసింహారావు గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చినట్లుగా తెలిపారు.

జనసేన నేతపై వైసీపీ సర్పంచి దాడి

మేడికొండూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం కొర్రపాడు సర్పంచి తనపై దాడి చేసి దూషించారని జనసేన తాడికొండ నియోజకవర్గ మీడియా కన్వీనర్ కందుల సైదయ్య గురువారం మేడికొండూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసీపీ సర్పంచి బొడ్డు నాగమల్లేశ్వరరావు, ఆయన కుమారుడు సురేష్, అన్న కుమారుడు రాజేంద్రతో కలసి పంచాయతీ కార్యాలయం వద్ద ఉండగా వారు తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఉన్న సమస్యలపై వచ్చిన విభేదాల కారణంగా సైదయ్యపై దాడికి పాల్పడినట్టు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు సర్పంచి నాగమల్లేశ్వరరావు, అతని కుమారుడు సురేష్, అతని అన్న కుమారుడు రాజేంద్రపై కేసు నమోదు చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 582.40 అడుగులు ఉంది. ఇది 289.93 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6979 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7029 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,988 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 45,396 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 45,396 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నర్సింగ్ విద్యార్థి అనుమానాస్పద మృతి



వినయ్‌కుమార్ (ఫైల్)

మాచర్లటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని సుద్దగుంతలకు చెందిన గంగపట్ల వినయ్‌కుమార్ (23) పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. వినయ్‌కుమార్ గత మంగళవారం నుంచి కనిపించకుండా పోయాడు. అదే రోజు అతని కోసం కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుండగా పట్టణంలోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడి కాలువ వద్ద అతని ఫోన్ లిఫ్ట్ చేశారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా వినయ్‌కుమార్ సెల్‌ఫోన్‌తోపాటు చెప్పులు లభ్యమయ్యాయి. వినయ్‌కుమార్ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుండగా గురువారం దుర్గిలోని బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద మృతదేహం లభ్యమైంది. మాచర్ల పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు తెలియలేదు.

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

మాచర్లటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన గురువారం మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని యాదవుల బజారుకు చెందిన వీర్ల రాంబాబు, నాగేశ్వరమ్మ దంపతులు గురువారం తమ పొలంలో ఘర్షణ పడ్డారు. అనంతరం పొలంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. సమీప పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మాచర్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని భైరవునిపాడు వద్ద జరిగింది. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన బొలక కృష్ణ గురువారం వివిధ పనులపై ద్విచక్ర వాహనంపై మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి వెళ్లాడు. రాత్రి వేళ తిరుగు ప్రయాణంలో భైరవునిపాడు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైకు పైనుంచి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98,107,118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

మేడికొండూరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



కేసుల వివరాలు వెల్లడిస్తున్న సీఆర్డీపీ ఎస్ఈ సుబ్రహ్మణ్యం

మేడికొండూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌డీపీ ఎస్ఈ పి.సుబ్రహ్మణ్యం, గుంటూరు టౌన్-2 ఏడీఈ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు సంయుక్తంగా గురువారం తనిఖీలు చేపట్టారు. మేడికొండూరు మండలంలోని 16 గ్రామాలలో ఈ తనిఖీలు చేపట్టారు. 60 మంది సిబ్బంది బృందాలుగా విడిపోయి గ్రామాలలో 2,188 సర్వీస్‌లను తనిఖీ చేశారు. వాటిలో 98 సర్వీసులకుగానూ ఓవర్ లోడ్ కింద రూ. 5,13,500 లక్షలు అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యం గుర్తించి మూడు సర్వీసులకు రూ.1.50 లక్షలు అపరాధ రుసుం విధించారు. మొత్తం 102 సర్వీస్‌లపై కేసులు నమోదు చేసి, రూ. 6.65 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు సీఆర్‌డీపీ సూపరింటెండెంట్ ఇంజనీరు పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ తనిఖీల్లో గుంటూరు రూరల్ ఏడీఈ గురునాథం, చిలకలూరిపేట ఏడీఈ ఆర్.అశోక్ కుమార్, గుంటూరు టౌన్ 2 డివిజన్ పరిధిలోని 9 మండలాల ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

49,551 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 50,816 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,551 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 43,384 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	7500	14500
నెంబరు. 5	8000	12000	నెంబరు.5	8000	11500
273	9000	11500	273	8500	12500
341	8000	15000	341	8000	13500
4884	11000	11000	4884	9500	12500
సూపర్ 10	-	-	సూపర్ 10	11800	11800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	12000
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	8000	11500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4500	9500

నేడు శ్రీసత్యసాయి ఆరోగ్య మల్టీస్పెషాల్టి వైద్యశాల ప్రారంభం

పిట్టలవానిపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సుజల స్రవంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంలో ఈనెల 13న ఉదయం 11గంటలకు నూతనంగా నిర్మించి ప్రారంభిస్తున్న శ్రీసత్యసాయి ఆరోగ్య మల్టీస్పెషాలిటీ వైద్యశాలను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారని వైద్యశాల నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం



అయ్యప్పస్వామి నగరోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి నగరోత్సవ కార్యక్రమాన్ని గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయం దగ్గర నుంచి పురవీధుల్లో నగరోత్సవం చేశారు. కార్యక్రమానికి భక్తజనం అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ నగరోత్సవంలో పాల్గొని స్వామికి పూజలు చేసి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

ఇరుముడుల పూజా కార్యక్రమం

జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ గురువారం ఇరుముడుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నరేంద్రవర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, గ్రామ అధ్యక్షుడు కొండలు, ఉమ్మారెడ్డి వెంకటేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంతర్గతరోడ్లు నిత్యం శుభ్రపర్చాలి

● కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీలు, అంతర్గతరోడ్లు నిత్యం శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. జమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్‌యార్డును పరిశీలించారు. అనంతరం జంతువధశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బేతనీకాలనీలో డ్రైనేజీలు, అంతర్గతరోడ్లు పరిశీలించి దోమల నివారణకు నిత్యం ఫాగింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సూర్యలంకరోడ్డులోని సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించి డ్రైనేజీ నీరు నిలిచి ఉండటంపై పాఠశాల సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే దానికి డ్రైనేజికి అనుసంధానం చేయాలన్నారు. పాఠశాలను ఆనుకొని ఉన్న పరిసరాల్లో మొక్కలు, చెత్తతో ఉండటం చూసి వెంటనే శుభ్రం చేయాలని పారిశుధ్య విభాగం అధికారులకు తెలియజేశారు. అనంతరం వివేకానందకాలనీలోని మున్సిపల్ పార్క్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, సీహెచ్ కరుణ, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ

కర్లపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దమ్మనవారిపాలెం గ్రామదేవత నాంచారమ్మ తల్లి దేవాలయం పునఃప్రతిష్ఠ సందర్భంగా గురువారం గ్రామ మహిళలు నాంచారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, హారతులిచ్చారు. 9 సార్లు మణిదీప పారాయణం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.వెంకటేశ్వరమ్మ, అండాలమ్మ, చందు రేణుక, మైలమంగమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్‌కు నివాళి

బాపట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు నిఘంటవును వ్యాకరణాన్ని ప్రచురించి తెలుగుభాషకు ఒక గుర్తింపు తెచ్చిన ఆంధ్ర భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ అని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. గురువారం సీపీ బ్రౌన్ వర్థంతి సభలో సాహితీభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావులు సంయుక్తంగా మాట్లాడుతూ సీపీ బ్రౌన్ తెలుగు - ఇంగ్లిష్, ఇంగ్లిషు - తెలుగు నిఘంటువులను రచించి ఇతర భాషల వారికి తెలుగు నేర్చుకోవటం సులభతరం చేశారన్నారు. అనంతరం రచయితలు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు తదితరులు సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వైద్యశిబిరం ద్వారా రోగులకు సేవలు

బాపట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దేవినూతల సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్ షేక్ అజ్మతుల్లా పాల్గొని 113మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు బీపీ చెక్ చేసి ఆరోగ్య సూచనలు చేశారు. చిన్న పిల్లలను ఈ వాతావరణంలో ఏవిధంగా ఉంచాలో వివరించి తగు జాగ్రత్తలు చెప్పారు. గర్భిణులకు సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కర్లపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పేరలి గ్రామం తూర్పు యాదవపాలెంకు చెందిన బుర్లా పృథ్వీ మృతి చెందారు. పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహాయ సహకారంతో గురువారం కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఏపూరి భూపతి రావు, గేరా ఏసుబాబు చేతులమీదగా మట్టి ఖర్చుల నిమిత్త రూ.5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో కాగిత విజయరాజు, మద్దిబోయన బుల్లియ్య, ఆవుల కొనయ్య, కాగిత అనీల్‌బాబు, గవిని శ్రీను,షేక్.బాబావలి, దాసరి రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యంగా..

● పది విద్యార్థులకు 100 రోజుల శిక్షణ
● సత్ఫలితాలు ఇస్తుందని ఆశాభావం



వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

వేమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదోతర గతిలో గతంలో కన్నా ఈ విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల లక్ష్యసాధన కోసం ఈ ఏడాది రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పదో తరగతి అనేది ప్రతి విద్యార్థికి ఎంతో ముఖ్యమైనది. ఈ మెట్టు ఎక్కితేనే పైచదువుల కోసం వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలని అనుకుంటాడు. అందుకు అనుకూలంగా ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ల్లో విద్యార్థులకు 100 రోజుల ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసింది. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ సంబంధించిన ప్రణాళికను రూపొందించింది. దీనికి అనుగుణంగా ఈ శిక్షణ కొనసాగుతున్నది. ఈ నెల రెండో తేదీన దీనిని ప్రారంభించారు. వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ఉన్న ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవోల పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులు పూర్తి బాధ్యతతో ఈ శిక్షణ కొనసాగుతుంది. ఈ ప్రణాళిక ద్వారా ప్రతి ఉన్నత పాఠశాలలో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా సెలవు లేకుండా కొనసాగిస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు పీరియడ్లు, స్టడీ అవర్లు కొనసాగుతున్నాయి. ప్రతిరోజు చివరి పీరియడ్‌లో పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు తిరిగి 1.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాలను సేకరించి వాటి ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో ఏ, బీ, సీ, డీ కేటగిరిలను విభజించి వారిలో సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను ఆయా సబ్జెక్టులను సంబంధించిన ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇప్పటి వరకు నిర్వహించిన నెలవారీ పరీక్షల ఫలితాలను తల్లిదండ్రులకు హోలిస్టిక్ కార్డుల ద్వారా తెలియజేశారు. ఫిబ్రవరి నెలలో ప్రీఫైనల్ మార్చి నెలలో గ్రాండ్ టెస్ట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ విధానం అమలు ద్వారా ఈ ఏడాది పది ఫలితాల్లో సత్ఫలితాలు సాధిస్తామని ఆశాభావాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు వ్యక్తపరుస్తున్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణ



వేమూరులో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివన్నారాయణ

వేమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక రోశయ్య మీటింగ్ హాల్లో గురువారం సుస్థిరాభివృద్ధి నుంచి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో శివన్నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015లో ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 17 లక్ష్యాలను 2030కి పూర్తిగా సాధించాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసంగా క్షేత్రస్థాయి నుంచి గ్రామ పంచాయతీ సచివాలయాలు మండల స్థాయి వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు లక్ష్య సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 17 లక్ష్యాలను 9 విభాగాలుగా విభజించారని, ఒక్కొక్క సంవత్సరంలో ఒక్కొక్క విభాగాన్ని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. లక్ష్యాలను గురించి విశదీకరించారు. ఈవోపీఆర్‌డీ శేఖర్, ట్రైనర్స్ ఆంజనేయప్రసాద్, సాధిక్, సుజాత, 17 లక్ష్యాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, మండల స్థాయి అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు (కొల్లూరు): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ లలితకుమారి ప్రారంభించారు. గురువారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ ఇప్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, ఎంపీడీవో ఎస్ వెంకటరమణ, ఈవోపీఆర్‌డి ఊహారాణి తదితరుల పాల్గొన్నారు.

కర్లపాలెం (ఆంధ్రజ్యోతి) : పేదరికం అనారోగ్యం లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణ అని ఎంపీపీ యారం వనజ అన్నారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో గురువారం సుస్థిరాభివృద్ధిపై సర్పంచులు, కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, సచివాలయం సిబ్బందికి 2 రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమైనాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ యారం వనజ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎంపీడీవో ఆద్దూరి శ్రీనివాసరావు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, పశువైద్యాధికారి రేచల్ దివ్య, ఎంపీపీ ఎం శ్రీనివాసులురెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

14న నీటి సంఘాల ఎన్నికలు

● సిద్ధం చేసిన రెవెన్యూ నీటిపారుదల శాఖాధికారులు
● గ్రామాలవారీగా రైతుల సమావేశాలు



అరవపల్లివద్ద మెయిన్‌కెనాల్ శిథిలావస్థకు చేరిన సైడ్ రివిట్‌మెంట్లు

రేపల్లె, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాల్వల అభివృద్ధికి పనిచేసిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తరువాత సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టింది. దీంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. రైత్వారీ సమస్యలపై అవగాహన ఉంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చేవారిని కమిటీల్లో ఉంచేలా రైతులంతా గ్రామాలవారీగా సమావేశాలు పెట్టుకుంటున్నారు. కూటమి శ్రేణుల భాగస్వామ్యం ఉండేలా సమన్వయంతో ముందుకు వెళుతుందన్నారు. ఇప్పటికే ప్రాదేశిక నియోజకవర్గాలకు సంబంధించిన డైరెక్టర్లుగా కొంత మంది పేర్లను జాబితాలో సిద్ధం చేసినట్లు సమాచారం.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం

● నీటిపారుదల శాఖ డీఈ దీన్‌దయాల్

సాగునీటి ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ యంత్రాంగంతో కలిసి అన్ని ఏర్పాటు పూర్తిచేశామని నీటి పారుదల శాఖ డీఈ దీన్‌దయాల్ తెలిపారు. ఓటర్ల జాబితాను ఆయా సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచామని ఈ నెల 5న నోటిఫికేషన్‌ను జారీ చేశామని ఎన్నికల ప్రక్రియ పనుల్లో నిమగ్నమయ్యామని అన్నారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు 14న ఎంపిక ఉంటుందని ఏకగ్రీవంగా రైతులంతా ముందుకు వస్తే వెంటనే చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో ప్రమాణస్వీకారం చేస్తామని పోటీ ఉంటే రైతులను సమావేశపరిచి వారు బలపరిచిన అభ్యర్థుల పేర్లను ఎంపిక ప్రక్రియ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 27డబ్ల్యూఏలకు ఎన్నికలు జరగనున్నట్లు వాటిల్లో మోర్తోట 6, రేపల్లె 7, నగరం 6, నిజాంపట్నం 4, చెరుకుపల్లి 2, డిస్ట్రిబ్యూటర్స్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికగా రెవెన్యూ సదస్సులు



పిట్టువారిపాలెం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న డీఎల్‌డీవో సువార్త, తహసీల్దార్ మెహర్‌కుమార్ తదితరులు

నగరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని స్పెషలాఫీసర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ తోటపల్లి, జిల్లేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ఏర్పాటైన రెవెన్యూ సదస్సులు అందరూ సద్వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. మొత్తం ఐదు అర్జీలు వచ్చాయని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

పిట్టువారిపాలెంలో..

పిట్టలవానిపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టువారిపాలెం గ్రామ సచివాలయం నందు తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, డీఎల్‌డీవో సువార్త ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు, భూసమస్యలు, క్యాస్ట్, ఇంకమ్ తదితర అంశాలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్, ఆర్‌ఐ శ్రీనివాసరావు, సర్వేయర్ ఆదిరామచంద్రరావు, వీఆర్వోలు వీఆర్‌ఏలు, సర్పంచ్ అశ్విని, సచివాలయ కార్యదర్శి సువర్చల, సిబ్బంది పాల్గొన్నారు.

పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాల్లో..

కొల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో మండల ప్రత్యేక అధికారి రాంబాలాజీరెడ్డి, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పాల్గొని రైతుల నుంచి భూసమస్యల పరిష్కారం కోసం అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ హర్షవర్దన్, దేవదాయ శాఖాధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హామీలను అమలు చేయాలి

● యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝూన్సీ



సీడీపీవో సుచిత్రకి వినతిపత్రాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకులు

రేపల్లె, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి): అంగన్‌వాడీలకు సమ్మె సందర్భంగా ఇచ్చిన ప్రభుత్వ హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝూన్సీ డిమాండ్ చేశారు. గురువారం రేపల్లె ప్రాజెక్టు కమిటీ సీడీపీవో ఎం సుచిత్రకు తమ సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా 2023 డిసెంబర్ 19నుంచి 2024 జనవరి 22వరకు 42రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె జరిగిన నేపథ్యంలో సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు మినిట్స్ కాపీలు ఇచ్చి నేటికి సంవత్సరమైన నేపథ్యంలో వాటిని అమలు చేయాలని కోరారు. ప్రధానంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి, రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్పు చేస్తూ వెంటనే జీవోను ఇవ్వాలని కోరారు. సీఐటీయూ బాపట్లజిల్లా అధ్యక్షులు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం అమలు చేయాలని 5సంవత్సరాల లోపు పిల్లలందరూ అంగన్‌వాడీ సెంటర్‌లో ఉండాలని జీవో ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలు చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో రేపల్లె ప్రాజెక్టు నాయకులు కె.రత్నకుమారి, పి.నిర్మల, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పాపాల పుట్టలు పగిలి వైసీపీ మంత్రుల అవినీతి రట్టవుతుంది : కొల్లా

బాపట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలోని పాపాల పుట్టలు పగిలి మంత్రుల అవినీతి రట్టవుతుందని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అనేక రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణాంధ్ర లక్ష్యంగా పరుగులు పెట్టిస్తుంటే గత వైసీపీ పాలనలో మంత్రులు చేసిన అవినీతి అక్రమాలు ఆరాచకాలు బయట పడుతున్నాయన్నారు.

నేడు పట్టభద్రుల ఆత్మీయ సమావేశం

వేమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వేమూరు, తెనాలి నియోజకవర్గాల పట్టభద్రుల ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు తెనాలి కోర్టు భవనాల సమీపంలోని ఎన్‌వీఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆనందబాబు క్యాంపు కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఆత్మయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఆలపాటి, ఆనందబాబు హాజరు కానున్నారు. తెనాలి, వేమూరు నియోజకవర్గాల పరిధిలోని పట్టభద్రులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నారు.

పట్టణంలో సభ్యత్వ నమోదు వేగవంతం



టీడీపీ సభ్యత్వనమోదు చేస్తున్న పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి సరోజినీ తదితరులు

బాపట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలో తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాలు మేరకు పార్టీశ్రేణులు పట్టణంలో తిరిగి సభ్యత్వాలు నమోదు చేస్తున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి మండపాటి ఆంద్రేయ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పల్లంస రోజినీ ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురి సభ్యత్వాలు నమోదు చేశారు. తెలుగుదేశం సభ్యత్వం భరోసానిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కూచిపూడి శ్యామసుందర్, పల్లంజీవన్, షాలెంరాజు, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

హిందువులంతా ఐక్యం కావాలి

● వరికూటి శివగోపి

నగరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కుల, వర్గ రాజకీయాలకు అతీతంగా హిందుసమాజం మొత్తం ఏకతాటిపైకి వచ్చి హిందు ధర్మ దేవాలయాల పరిరక్షణ చేయడం ద్వారానే హిందూ పరిరక్షణ జరుగుతుందని వరికూటి శివగోపి అన్నారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 5వతేదీ విజయవాడ గన్నవరం దగ్గర కేసరపల్లిలో జరుగు భారీ హైందవ శాంఖారావం సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అందులో భాగంగా కరపత్రాలను పంచి స్టిక్కర్‌లను అంటించి జనజాగరణ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హిందుచైతన్యవేదిక రాష్ట్ర సహకన్వీనర్ అంబటి మారుతీరామ్ సమరసతసేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, తోట చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు టేబుల్ క్యాలెండర్ విడుదల

రేపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు, కక్షదారులకు, పోలీసులు, కోర్టు సిబ్బందికి ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కోర్టు టేబుల్ క్యాలెండర్ దోహదపడుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు అన్నారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో రేపల్లె బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కోర్టు టేబుల్స్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాలెండర్‌లు న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గిరధర్, న్యాయవాదులు ఒడుగు రాంబాబు, దారం సాంబశివరావు, ప్రశాంత్‌కుమార్, కె.శ్రీనివాసరావు, కె.రవికుమార్, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుదలకు సీపీఎం నిరసన



విద్యుత్ బిల్లులు గురించి అవగాహన కల్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

బాపట్ల, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): పెరిగిన విద్యుత్‌ఛార్జీలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. గురువారం పట్టణంలోని ఉప్పరపాలెంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేయాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధంగా ఛార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. అసలు కంటే కొసలు అధికంగా జనంపై పడుతుందన్నారు. అక్టోబరు నెలలో 380 రూపాయల బిల్లు వస్తే నవంబరు నెలలో 550 రూపాయలకు పెరగటం దారుణమన్నారు. కావున విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

అనంతరం పెరిగిన విద్యుత్ బిల్లులను తీసుకొని తగలబెట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2,14,572లను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఇద్దరు లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన యల్లమాటి రాజ్యలక్ష్మీ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. చికిత్స నిమిత్తంగా రూ.24,500లు ఖర్చు అయ్యాయి. పెరవలి గ్రామానికి చెందిన దాసరి మల్లికార్జునరావు వైద్యం నిమిత్తంగా రూ.1,90,072లు ఖర్చు చేశారు. ఆర్థికంగా వెనుకబడిన తమకు వైద్యం కోసం ఖర్చు చేసిన డబ్బును ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆనందబాబుకు లిఖితపూర్వకంగా విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే సిఫారసు మేరకు వారిద్దరికి వైద్యం కోసం ఖర్చు చేసిన మొత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైంది. సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే వారికి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, బీసీ సంఘ నాయకులు శివకృష్ణ పాల్గొన్నారు.

అల్పపీడనం కారణంగా రైతుల్లో ఆందోళన



ఆరబెట్టిన ధాన్యానికి టార్పాలిన్ పట్టాలు కప్పుతున్న రైతులు



యంత్రాల సాయంతో వరికోతలు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనంతో వాతావరణంలో మార్పుల కారణంగా వరి పొలాల్లో రైతులు యంత్రాలతో కోతలు నూర్పిళ్ళు చేసుకునేందుకు ఆందోళనపడుతున్నారు. దీంతో వాతావరణంలో మార్పుల వల్ల వర్షం కురిస్తే ఎలా ఉంటుందోనని నూర్పిడి చేసుకున్న ధాన్యాన్ని రైతులు టార్పాలిన్ పట్టాలు కప్పుకొని జాగ్రత్త చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అధిక ఖర్చుల భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగువ ఆయకట్టుకు రబీకి సాగుకు నీరు అందిస్తాం

● వెల్లటూరు ఛానల్ తాత్కాలిక పనులు పరిశీలించిన ఎస్‌ఈ



వెల్లటూరు ఛానల్ చప్టా తాత్కాలిక పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ వెంకటరత్నం, టీడీపీ నాయకులు

భట్టిప్రోలు(కొల్లూరు), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : వెల్లటూరు ఛానల్ చప్టా తాత్కాలిక పనులను ఎస్‌ఈ వెంకటరత్నం గురువారం పరిశీలించారు. భట్టిప్రోలు, వెల్లటూరు మధ్య నగరం మండలం, తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే వెల్లటూరు ఛానల్ చప్టా కుంగిపోయి దెబ్బతింది. ఆ ప్రదేశంలో సాగునీటి శాఖాధికారులు దిగువ ఆయకట్టుకు రబీ సీజన్‌కు సాగునీరు అందించే తాత్కాలిక పనులను చేపట్టారు. ఆయా పనులను ఎస్‌ఈ వెంకటరత్నం, డీఈ దీనదయాళ్ పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. చప్టా వద్ద పనులు పూర్తయిన వెంటనే వెల్లటూరు ఛానల్‌కు సాగునీరు విడుదల చేసి దిగువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామని ఎస్‌ఈ తెలిపారు. పరిశీలనలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ, టీడీపీ నాయకులు మోటూరి పుణ్యశ్రీనివాసరావు, దీవి చంటి, ఇరిగేషన్ ఏఈ సువర్చల తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌ను ప్రకటించాలి

● జనసేన దివ్యాంగుల నాయకులు గోగన ఆదిశేషు

బాపట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌ని ప్రకటించాలని జనసేన దివ్యాంగుల నాయకులు గోగన ఆదిశేషు కోరారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6నెలలైనా అనేక కార్పొరేషన్ చైర్మన్ల ప్రకటనలు చేసి దివ్యాంగుల కార్పొరేషన్ ఇంతవరకు ప్రకటించలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి వెంటనే కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్లను ప్రకటించాలని కోరారు.

గిట్టుబాటు ధర కల్పించటంలో కూటమి ప్రభుత్వం విఫలం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

చెరుకుపల్లి, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి): రైతులకు పంట గిట్టుబాటు ధర అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గురువారం చెరుకుపల్లి మండల కనగాల వద్ద రైతులతో ఆయన మాట్లాడారు. ఇటీవల వర్షాలకు నేలవాలిన పైరు, ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాల నుంచి ధాన్యం కొనుగోలు వరకు అనేక ప్రయోజనాలు కలిగించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను పట్టించుకునే వారే కరువయ్యారని విమర్శించారు. తమ అధినేత జగన్ పిలుపుమేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద రైతులకు అండగా వైసీపీ నిరసన కార్యక్రమం చేపడుతుందన్నారు. రైతులు,పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

15న జరిగే మహాగర్జనను జయప్రదం చేయాలి

రేపల్లె,డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీల వర్గకరణపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆర్టికల్ 341ను పరిరక్షించాలని కోరుతూ ఈనెల 15న ఆదివారం సాయంత్రం గుంటూరులో జరిగే మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని జైభీమ్ రామ్‌భారత్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవ రమేష్‌రాంజీ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాలల మహాగర్జన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిలభారత మాలల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ సారథ్యంలో నిర్వహించనున్న గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.బాబూరావు, చెరుకూరు నరసింహారావు, రమేష్, బాబు, ఎన్ వాసుబాబు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



డాగ్.. డయాబెటిస్!



షుగర్ వ్యాధి మనుషులనే కాదు కుక్కలను కూడా అల్లాడిస్తోంది. ఈ మధ్య కాలంలో కుక్కల్లో షుగర్ వ్యాధి బాగా ప్రబలుతున్నట్లు పశు వైద్యులు గుర్తించారు. గతంలో డాగ్ డయాబెటిస్ కేసులు (కుక్కల్లో షుగర్ వ్యాధి) ఒక శాతం వరకు ఉండేవి. ఈ మధ్య కాలంలో ఐదు శాతం వరకు పెరిగినట్లు తెలుస్తోంది. గుంటూరులోని జిల్లా పాలీ క్లినిక్ వైద్యులు కూడా కుక్కల్లో షుగర్ వ్యాధి ప్రబలుతున్నట్లు గుర్తించారు.

- కుక్కల్లో ప్రబలుతున్న షుగర్ వ్యాధి
- 1 నుంచి 5 శాతానికి పెరుగుదల
- మితిమీరిన ఆహారమే కారణమంటున్న వైద్యులు
- పందెపు ఎద్దుల్లోనూ ఇదే సమస్య
- డయాలసిస్ యూనిట్ కోసం విజ్ఞప్తి

గుంటూరు సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఎక్కువ శాతం కుక్కలు షుగరు వ్యాధికి గురవుతున్నాయి. వివిధ సమస్యలతో ఆసుపత్రికి తీసుకువచ్చిన కుక్కలకు పరీక్షలు నిర్వహించగా షుగర్ వ్యాధి ఉన్నట్లు తేలుతుందని పశువైద్యులు చెబుతున్నారు. కుక్క రక్తంలో గ్లూకోజ్ లెవెల్స్ 76 ఎంజీ/డీఎల్ నుంచి 119 ఎంజీ/డీఎల్ వరకు ఉంటే షుగర్ సాధారణ స్థాయిలో ఉన్నట్లు భావిస్తారు. వ్యాధి బారిన పడిన కుక్కల రక్త నమునాల్లో గ్లూకోజ్ లెవెల్స్ 120 ఎంజీ/డీఎల్ నుంచి 160 ఎంజీ/డీఎల్ పైన ఉంటున్నట్లు తేలింది. షుగర్ వ్యాధి సోకిన కుక్కలు ఎక్కువగా నీళ్లు తాగటం, చాలా నీరసంగా ఉండటం, ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేయటం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, కంటిలో శుక్లాలు కలిగి చూపు మందగించడం వంటి సమస్యలతో బాధపడుతూ ఉంటాయని పశు ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.



అతి ప్రేమతో అనర్థాలు..

కుక్కల్లో షుగర్ వ్యాధి ప్రబలటానికి ప్రధాన కారణం మారిన ఆహారపు అలవాట్లేనని తెలుస్తోంది. వాటి మీద ఉన్న అతి ప్రేమతో ఏదిపడితే అది తినిపించటం ప్రాణాల మీదకి తెస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. బిర్యానీ ఎక్కువగా తినిపించటం, పిజ్జాలు, బర్గర్‌లు పెట్టడం, జంక్ ఫుడ్, శీతల పానీయాలు అతిగా తాగించడం, శారీరక శ్రమ లేకపోవటం వలన ఊబకాయం ఏర్పడి కుక్కలు షుగర్ వ్యాధి బారిన పడుతున్నట్లు గుర్తించారు. వయస్సు ప్రభావం కూడా వ్యాధికి కారణంగా కనిపిస్తుంది. కుక్క మధ్య వయస్సుగా పిలిచే 5 సంవత్సరాల తర్వాత చాలా వాటిల్లో వ్యాధి లక్షణాలు ఉంటున్నట్లు తెలుస్తోంది. కుక్కల్లో ఎక్కువగా కనిపించే చర్మ వ్యాధుల నివారణ



కొరకు వినియోగించే స్టెరాయిడ్స్ దీర్ఘకాలిక వాడకం షుగర్ వ్యాధి ముప్పును తెచ్చిపెడుతోంది.

గన్నవరం వెళ్లాల్సి వస్తుంది..

గుంటూరులోని జిల్లా పశువైద్యశాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి రిఫరల్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఎక్కువ కేసుల్లో కిడ్నీ ఫెయిల్యూర్ కన్పిస్తుంది. అటువంటి సందర్భంలో కిడ్నీ ఫెయిల్ అయిన పశువు జీవిత కాలం పెంచటానికి డయాలసిస్ మాత్రమే చివరి అవకాశం అని వైద్యులు చెబుతున్నారు. గుంటూరులోని పాలీ క్లినిక్‌లో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. దీనివలన కిడ్నీ ఫెయిల్యూర్ కేసులను దూరంలో ఉన్న గన్నవరం వెటర్నరీ కాలేజికి పంపే ఇబ్బందులు తప్పుతాయని అంటున్నారు.

పందెపు ఎద్దుల్లోనూ...

ఈ మధ్య కాలంలో పందెపు ఎద్దుల్లోనూ షుగర్ వ్యాధి గుర్తించినట్లు గుంటూరు పాలీ క్లినిక్ వైద్యులు తెలిపారు. మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి వచ్చిన ఎద్దులకు నిర్వహించిన యూరిన్, రక్త పరీక్షల్లో షుగర్ వ్యాధి నిర్ధారణ అయినట్లు తెలిపారు. గుంటూరు పాలీ క్లినిక్‌లో కిడ్నీ ఆరోగ్యాన్ని తెలియజేసే క్రియాటిన్ లెవెల్స్ కూడా పరీక్షల ద్వారా నిర్ధారిస్తున్నారు. అనారోగ్యంతో వచ్చిన పశువులకు లివర్‌లో టోటల్ ప్రోటీన్, అల్బ్యుయుమిన్, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, అల్బ్యుయుమిన్ పాస్పటీవ్, కిడ్నీలో క్రియాటిన్, బ్లడ్ యూరియా పరీక్షలు చేసి రోగాన్ని గుర్తిస్తున్నారు.

ఇన్సులిన్ వాడకమే శరణ్యం



కుక్కల్లో షుగర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత ఇన్సులిన్ వాడుతున్నట్లు గుంటూరు పాలీ క్లినిక్ వైద్యులు చెబుతున్నారు. బరువును బట్టి ఇన్సులిన్ వేయాల్సిన యూనిట్లు నిర్ణయిస్తామని చెబు తున్నారు. ఉదాహరణకు కుక్క బరువు సుమారు ఐదు కిలోల వరకు ఉంటే 4 నుంచి 5 యూనిట్లు ఇన్సులిన్ వేయాలని చెబుతున్నారు. ఇన్సులిన్‌లో కూడా మూడు రకాలు ఉన్నట్లు తెలుస్తోంది. షార్ట్-యాక్టింగ్ ఇన్సులిన్, ఇంటర్మీడియట్ -యాక్టింగ్ ఇన్సులిన్, లాంగ్-యాక్టింగ్ ఇన్సులిన్ ఉన్నట్లు చెబుతున్నారు. అత్యవసర చికిత్సలు, ఆపరేషన్ సమయం లో షార్ట్-యాక్టింగ్ ఇన్సులిన్ వాడుతున్నారు. దానివల్ల కుక్క రక్తంలో గ్లూకోజ్ స్థాయి వెంటనే స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు.

ఆరోగ్యకర ఆహారం పెట్టాలి



ఎంతోమంది చాలా ప్రేమతో కుక్కలను పెంచుకుంటున్నారు. వాటికి ఆరోగ్యకర ఆహారం పెట్టాలి. ఇష్టం వచ్చినట్లు ఆహారం ఇవ్వటం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కూల్ డ్రింక్స్ తాపడం, చాక్లెట్‌లు పెట్టడం వంటివి హానికరం. కుక్కలకు చేపలు అసలు పెట్టకూడదు. వాటిని ప్రేమతో పెంచేటప్పుడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా యజమానుల పైనే ఉంటుంది.

- మంగళగిరి రత్నజ్యోతి, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, గుంటూరు

డయాలసిస్ యూనిట్ ఉంటే బాగుంటుంది



గుంటూరు జిల్లా పశువైద్యశాలకు డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కిడ్నీకి సంబంధించిన కేసులకు ఇక్కడ మెరుగైన వైద్యం చేసే అవకాశం ఉంటుంది. డయాలసిస్ సకాలంలో ప్రారంభించటం వల్ల అనారోగ్యం బారిన పడిన పశువుల జీవిత కాలం పెంచే అవకాశం ఉంటుంది.

- లక్కింశెట్టి నాగేశ్వరరావు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, గుంటూరు

ఉత్తరాఖండ్‌దే పైచేయి

- తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగుల ఆధిక్యం



అభిమన్యు 72 పరుగులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్థాన్‌పై ఉత్తరాఖండ్ జట్టు పైచేయి సాధిస్తుంది. రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 266 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 95 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 349 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్తరాఖండ్ బ్యాటర్లు అభిమన్యు 72, అనయ నేగి 71, మయాంక్ ముదిలా 63, కుశగ్ర కోరంగ 54 పరుగులు సాధించారు. రాజస్థాన్ బౌలర్ ఆదిత్య రెండు వికెట్లు పడగొట్టాడు. దీంతో ఉత్తరాఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

అమరావతిలో 'ఫైవ్'స్టార్ హోటల్స్

విజయవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో స్టార్ హోటల్స్ ఏర్పాటుకు తీవ్ర పోటీ నెలకొంది. అతి త్వరలో ఐదు స్టార్ హోటల్స్ ఏర్పడబోతున్నాయి. స్టార్ హోటల్స్ ఏర్పాటుకు ఆయా సంస్థల యాజమాన్యాల నుంచి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. నూతన పర్యాటక పాలసీ తీసుకు వస్తున్న నేపథ్యంలో, హోటల్స్ రంగం ఎంతో ఆసక్తిగా ఉంది. ప్రస్తుతం భూ ప్రతిపాదనల దశలో ఉన్నాయి. అమరావతిలో ముందుకు వచ్చిన సంస్థలను చూస్తే ఐఆర్‌సీటీసీ, అట్మాస్పియర్ కేర్, ఒబెరాయ్ గ్రూప్, తాజ్ గ్రూప్‌కు చెందిన ఐహెచ్‌సీఎల్, రహేజా గ్రూపులు ఉన్నాయి. ఐర్‌సీటీసీ 3 ఎకరాలు, అట్మాస్పియర్ కేర్ కు 10 ఎకరాలు, ఐహెచ్‌సీఎల్‌కు 10 ఎకరాలు, ఒబెరాయ్ గ్రూప్‌కు 10 ఎకరాలు, రహేజా గ్రూప్‌కు 5 ఎకరాల చొప్పున కావాల్సి ఉంది. రహేజా గ్రూప్ విజయవాడ లో కూడా కృష్ణానది ఒడ్డున స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి ఐదెకరాలు కావాల్సి ఉంది. వాంటేజ్ గ్రూప్ మచిలీపట్నంలోని మంగినపడి బీచ్ దగ్గర స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి 10 ఎకరాలు కావాల్సి ఉంది. ఆయా సంస్థలతో తుది అగ్రిమెంట్లు చేసుకునే క్రమంలో భూములను స్వాధీనం చేసే అవకాశం ఉంది.

టమాట లోడు లారీ బోల్తా



గుంటూరు - చిలకలూరిపేట ఎన్‌హెచ్-16పై బుడంపాడు బైపాస్ వద్ద కర్ణాటక నుంచి టమోటా లోడుతో వస్తున్న లారీ డివైడర్‌ని ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో నాలుగు కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. **- గుంటూరు**

లాలుపురం శివారులో యువకుడి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- నమ్మకంగా తీసుకు వచ్చి రాళ్లతో కొట్టి చంపిన నిందితులు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌పురం రోడ్డులోని భవానిపురంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. హతుడిని లాలాపేటకు చెందిన షేక్ మస్తాన్‌షరీఫ్ (40)గా గుర్తించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, నల్లపాడు సీఐ వంశీధర్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్ షరీఫ్ లాలాపేటలోని బోసుబొమ్మ సెంటర్‌లో మొబీనా మెటల్ స్టోర్ అనే దుకాణం నిర్వహిస్తున్నాడు. తన తండ్రితో కలిసి వ్యాపారం చేస్తున్నాడు. అతనికి, భార్యకి మనస్పర్థలు వచ్చి 2020లో విడిపోయారు. ఇదిలాఉంటే గతంలో వీరి షాపులో ఆర్ అగ్రహారం ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొంతకాలం పని చేసింది. ఆమెతో మస్తాన్ షరీఫ్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ తరువాత కొంత కాలానికి ఆమెను పని నుంచి తీసివేశారు. అయినప్పటికీ వారి మధ్య సంబంధం కొనసాగుతూనే ఉంది. ఆర్‌అగ్రహారంకు చెందిన ఆమెకు భర్త లేకపోవడంతో ఇతను నేరుగా ఇంటికి వెళ్తూ ఉండేవాడు. మద్యం తాగుతూ అక్కడే ఎక్కువ సమయం గడిపేవాడు. ఇది ఆమె కుమారుడుకి ఇష్టం లేదు. షరీఫ్ రాకపట్ల ఆమె కుమారుడు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నాడు. మా ఇంటికి వద్దు.. మా పరువు పోతుంది.. అని పలుసార్లు షరీఫ్‌ని వారించాడు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో ఆగ్రహించిన యువకుడు ఎలాగైనా షరీఫ్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. దీంతో షరీఫ్ దుకాణంలో పని చేసే సంగడిగుంటకు చెందిన సుభానితో కలసి పథకం రూపొందించాడు. ఈ క్రమంలో ఈ నెల 10న సాయంత్రం షరీఫ్‌ను షాపులో పని చేసే సుభాని గాంధీపార్క్‌కు అని చెప్పి బయటకు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమె కుమారుడుతోపాటు మరో వ్యక్తి కలిశాడు. నలుగురు లాలుపురం శివారు భవానిపురం వద్ద ఖాళీ స్థలాల్లో మద్యం తాగారు. అక్కడ ముగ్గురు కలిసి షరీఫ్‌పై రాళ్లతో దాడి చేసి హత మార్చారు. మృతదేహం కనిపించకుండా లోపల ముళ్ల చెట్ల వైపు పడేశారు. అయితే రాత్రికి షరీఫ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సుభానీని అడిగారు. అయితే షరీఫ్‌కు వాంతులు కావడంతో జీజీహెచ్‌కు వెళ్లాడని చెప్పాడు. అనుమానం వచ్చి సుభానిని గట్టిగా అడగ్గా షాపులో పని చేసిన మహిళ కుమారుడు కొట్టాడన్నారు. గురువారం ఓ ఆటో డ్రైవర్ బహిర్భూమికి అటుగా వెళ్లగా మృతదేహం బయటపడింది. విషయం తెలిసిన వెంటనే సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, సీఐ వంశీధర్ సంఘటనా స్థలానికి వెళ్లారు. హత్యకు గురైన షరీఫ్ అక్క ఆరీఫా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్యలో పాల్గొన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కాగా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నన్ను బెదిరించి లొంగదీసుకున్నాడు

- రెండేళ్లు నాకు నరకం చూపించాడు
- రోజుకు రూ.4 వేలు చొప్పున వసూలు చేశాడు
- వైసీపీ నేత నుంచి ప్రాణ రక్షణ కల్పించండి
- మీడియా ముందు బాధిత మహిళ ఆవేదన



గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాను వైసీపీ నాయకుడునని, తనకు వైసీపీ నేతలు అప్పిరెడ్డి, మద్దాలి గిరి తెలుసునని చెప్పి నన్ను బెదిరించి లొంగదీసుకున్నాడు, ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసి తనను రెండేళ్ల పాటు చిత్రహింసలకు గురి చేసి నరకం చూపించాడని బాధిత మహిళ వాపోయారు. గురువారం నగరంపాలెంలోని ఓ న్యాయవాది నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను చిలకలూరిపేట రోడ్డులో మరమరాల బట్టీ, కిరాణాషాపు నిర్వహిస్తుంటానని తెలిపారు. సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వెంగళాయపాలెంకు చెందిన వైసీపీ నాయకుడు దేవరకొండ నాగేశ్వరరావు నాపై కన్నేసి నన్ను లొంగదీసుకునేందుకు మా షాపులో మూడు దఫాలు దొంగతనాలు చేయించాడన్నారు. ఏమీ తెలియనట్లు షాపు వద్దకు వచ్చి తాను వైసీపీ నాయకుడిని అని, మీ షాపులో దొంగతనం జరిగిందంట కదా పోలీసులతో మాట్లాడి దొంగలను పట్టుకునేలా చేస్తానని నమ్మించాడని వివరించారు. ఫోన్ నంబర్ తీసుకొని బెదిరించి తనను లొంగదీసుకున్నాడని అన్నారు. ఆ తర్వాత నగ్నంగా వీడియోలు, ఫొటోలు తీసి వాటిని సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానని బెదిరించి ప్రతి రోజూ తన నుంచి నాలుగు వేల రూపాయలు వసూలు చేశాడని వివరించారు. ఆ తర్వాత మనకు మధ్యలో నీ భర్త అడ్డుగా ఉన్నాడని, ఆయన్ను తప్పించేందుకు విష ప్రయోగం చేయాలంటూ తీవ్ర ఒత్తిడి తెచ్చాడన్నారు. దీనిలో భాగంగానే ఓబిక్షగాడిని చంపాడన్నారు. వైసీపీ నాయకుడు నాగేశ్వరావు, ఆయన అనుచరులు తమ పట్ల అత్యంత క్రూరంగా ప్రవర్తించారన్నారు. వారికి భయపడి మా ముగ్గురు పిల్లలు స్కూలు, కాలేజీలకు వెళ్లడం మానేశారన్నారు. తన భర్తను అనేకసార్లు చంపడానికి ప్రయత్నించాడన్నారు. నిందితుడు నాగేశ్వరరావు ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరింది. నాగేశ్వరావు, ఆయన అనుచరుల నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు. తాము ఫిర్యాదుచేసి 20రోజులు దాటినా ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు.

కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందన్న ధైర్యంతో బాధిత మహిళ ముందుకొచ్చి పోలీసులను ఆశ్రయించిందన్నారు. ఇప్పటికే రెండుసార్లు ఎస్పీని, అదేవిధంగా నగరంపాలెం, మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సమీక్షలు.. ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)

కొన్ని పంచాయతీలను విలీనం చేసి పదేళ్లు దాటిందని, అయితే పరిశుభ్రమైన తాగునీటిని అందించలేని పరిస్థితి ఉందన్నారు. గతంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి రుణాలు మంజూరై ఉన్నాయని, అయితే కొన్ని పనులు ప్రారంభించి నిలుపుదల చేశారన్నారు. ఆ పనులను కొనసాగించడమా... అంచనాలను సవరించి కొత్తగా చేపట్టడమా అనే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ స్పందించి మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిధిలో భాగస్వామ్యమైన మంగళగిరి నియోజకవర్గానికి కూడా మౌలిక సదుపాయాల కల్పన పనులను పొడిగించాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనులు పూర్తి చేస్తామన్నారు.

సూచనలు.. లక్ష్యాలు

కలెక్టర్ల సదస్సు చివరి రోజున వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్లకు కొన్ని సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వచ్చే మూడున్నర నెలల్లో పీఎంఏవై అర్బన్ కింద 4200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గుంటూరు కలెక్టర్‌కు లక్ష్యాన్ని నిర్దేశించారు. పీఎంఏవై అర్బన్‌ని 2026 మార్చి వరకు కేంద్ర ప్రభుత్వం గడవు పొడిగించినందున సాధ్యమైనంత త్వరగా పెండింగ్ గృహాలు పూర్తి చేయాలన్నారు. గోకులాల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. అటవీ శాఖ క్లియరెన్స్‌లు జిల్లాలో ఏడు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణీకరణ వేగవంతంగా విస్తరిస్తున్నందున ప్రతీ ప్రాంతానికి మౌలిక సదుపాయాల కల్పనకు ఒక బ్లూ ప్రింట్ తయారు చేసి అమలు చేయాలన్నారు. కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్లానింగ్ చేసుకుని ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మంగళగిరిలో ఐటీ పార్కు నిర్మాణానికి 200 ఎకరాల భూమిని గుర్తించాలని ఆదేశించారు. అమరావతిని బుద్ధిస్టు సర్క్యూట్‌గా పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కూడా ప్రణాళిక రూపొందించాలన్నారు. మానవవనరులు, గృహ నిర్మాణం, చైల్డ్ వెల్ఫేర్, వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఇలా దాదాపు అన్ని విభాగాలలో బాపట్ల జిల్లాకు సంబంధించి సమీక్షలో చర్చించించారు. రాబోయే నాలుగున్నరేళ్లలో ఆయా రంగాలలో సాధించాల్సిన పురోగతితో పాటు జిల్లాలో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉన్న వనరుల లభ్యత వంటి అంశాలన్నీ సదస్సులో చర్చకు వచ్చాయి

ఓఆర్ఆర్‌తో గుంటూరు - విజయవాడ - అమరావతి కలిసిపోతాయి

అమరావతి ఔటర్ రింగురోడ్డు డీపీఆర్‌ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2026 డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ ఔటర్ రింగురోడ్డు అభివృద్ధితో గుంటూరు, అమరావతి, విజయవాడ, వీటి మధ్య ఉన్న గ్రామాలు కలిసిపోతాయని సీఎం చెప్పారు. దీంతో పట్టణీకరణ పెరిగిపోతుందని, ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేసి ప్రాధాన్యక్రమంలో పనులను నిర్ణయించి, ఆ దిశగా వాటిని చేపట్టాలని సూచించారు.

వరప్రదాయినికి వీడిన గ్రహణం

సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా నిలిచే గోదావరి జలాల తరలింపు పథకానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. కూటమి ప్రభుత్వం ఈ పథకం నిర్మాణాన్ని పట్టాలెక్కిస్తూ కలెక్టర్ల సదస్సులో సీఎం నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గోదావరి పెన్నా నదుల అనుసందానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టగా వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్మాణాన్ని నిలిపివేసింది. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి నీటిని అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. అయితే వైసీపీ ప్రభుత్వం నిధుల విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. నిర్మాణ వ్యయం రూ.6020 కోట్లు కానున్నది. 466 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ పథకం పూర్తి చేస్తే సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు మహర్దశ పడుతుంది. గోదావరి, పెన్నా అనుసందానం కుడి కాల్వ ఆయకట్టుకు జీవం పోస్తుంది.

రైల్వే గుర్తింపు ఎన్నికల్లో సంఘ్ ఘన విజయం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో గుర్తింపు సంఘం కోసం జరిగిన ఎన్నికల్లో దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ (ఎస్‌సీఆర్‌ఈఎస్) ఘన విజయం సాధించింది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో గుంటూరు డివిజన్ వ్యాప్తంగా జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు గురు వారం ఉదయం పట్టాభిపురంలోని గుంటూరు డీఆర్‌ఎం కార్యాలయం ఆవర ణలో నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా మొత్తం 4060 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 2036 ఓట్లను సంఘ్, 1660 ఓట్లను దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు సాధించాయి. దీంతో 376 ఓట్ల ఆధిక్యంతో ఎంప్లా యిాస్ సంఘ్ గెలుపొందినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఫలితాలు వెలువడగానే సంఘ్ నాయకులు విజయోత్సవ ర్యాలీ, గెలుపు సంబరాలను నిర్వహించారు. పరస్పరం మిఠాయిలు పంచుకొని ఆనందోత్సాహంతో సంబరాలు చేశారు. ఈసందర్భంగా సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీవీ రమణ య్య మాట్లాడుతూ రైల్వే కార్మికులు సంఘ్‌కు అండగా నిలిచినందుకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా సంఘ్ ఇచ్చిన హామీల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలపై సాధ్యమైనంత త్వరగా అధికారులతో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేయించి చర్చిస్తామన్నారు.



రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిాస్ సంఘ్ నాయకులు విజయోత్సాహం

రిటర్నబుల్ ప్లాట్లకు ఈ- లాటరీ

తుళ్లూరు, డిసెంబరు 12: అమరావతి రాజధాని అమరావతి రైతుల ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లకు విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో గురువారం ఈ- లాటరీ నిర్వహించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రాజధానిలో తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని సీఆర్డీఏ అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ బీఎల్ రాజకుమారి తెలియజేశారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజులలోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ క్రతువు పూర్తి చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఈ-లాటరీ నిర్వహించారు. మొత్తం 14 గ్రామాలకు చెందిన 261 మంది రైతులకు రెసిడెన్సిల్-130, కమరిషయల్ -113 ప్లాట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ ఆఫీసు మేనేజర్ వల్లభనేని శ్రీనివాసరావు, ఎస్టేట్ జాయింట్ డైరెక్టర్ వీ.డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భీమారావు స్వర్ణమేరి, సాయి శ్రీనివాస్ నాయక్, పద్మావతి, హస్సేన్ సాహెబ్, కె.ఎస్.భాగ్యరేఖ, రవీందర్, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరావు, తహసీల్దార్ అరుణాదేవీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విజయవాడ సీఆర్డీయే కార్యాలయంలో నిర్వహించిన లాటరీలో రైతులకు ప్లాటు పత్రాలు అందజేస్తున్న అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ రాజకుమారి



హోమం, పూజల్లో పాల్గొన్న భక్తులు

మాధవస్వామి ఆలయంలో పూజలు

విమాన శిఖర గోపుర పునఃప్రతిష్ఠ

అద్దంకి, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : అద్దంకి పట్టణంలోని మాధవ స్వామి దేవాలయం విమాన శిఖర గోపుర పునః ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు గురువారం రెండవ రోజు నిర్వహించారు. గురువారం ఉదయం పారాయణం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, శిఖరానికి పంచగవ్య శుద్ధి, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. విష్ణు సహస్ర నామ పారాయణం, గాయత్రీ హోమం పంచసూక్త హోమం నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో కూడా ప్రత్యేక పూజల అనంతరం శనివారం ఉదయం 8-04 గంటలకు విమాన శిఖర గోపుర ప్రతిష్ఠను నిర్వహించనున్నారు. హోమం, పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు శింగరకొండలో హనుమత్ వ్రతం

భక్తుల దీక్ష విరమణ, ఏర్పాట్లు చేసిన అధికారులు

అద్దంకి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హనుమత్ వ్రతం సందర్భంగా శుక్రవారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. ఆంజనేయ స్వామి మాలాధారణ భక్తులు దీక్షా విరమణ కూడా శుక్రవారం జరగనుండడంతో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి దీక్షా భక్తులు గురువారం రాత్రి కి శింగరకొండకు చేరుకున్నారు. ఉదయం 7-30 గంటలకు దీక్షధారులతో ఆలయ ప్రదక్షిణ, ఇరుముడి ద్రవ్యములతో ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, 9 గంటలకు హనుమత్ వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు మన్యుసూక్త హోమము, అన్న ప్రసాద వితరణ జరుగుతాయని ఈవో తెలిపారు.

ముగిసిన హనుమాన్ చాలీసా పారాయణం

ఇంకొల్లు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు కృష్ణనగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసంలో ప్రారంభించిన హనుమాన్ చాలీసా పారాయణం గురువారంతో ముగిసింది. 40 రోజులపాటు భక్తులు చాలీసా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, చివరి రోజు 108 సార్లు పారాయణం నిర్వహించి ముగించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు.

16 నుంచి శిక్షణ తరగతులు

చినగంజాం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్ నందు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శిలు, 13 సచివాలయాల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి గురువారం తెలిపారు. ఒంగోలు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు మేరకు ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీలు, పేదరిక నిర్మూలన, నీటి వనరుల అభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత, సుపరిపాలన తదితర అంశాలపై స్థిరమైన లక్ష్యాలను గ్రామ స్థాయిలో సాధించేందుకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16 నుంచి 17 వ తేదీ వరకు జరిగే మొదటి బ్యాచ్‌లో మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులకు, 18 నుంచి 19వ తేదీ వరకు జరిగే రెండవ బ్యాచ్‌లో 13 గ్రామ సచివాలయల్లోని డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, అగ్రికల్చర్, వెటర్నరీ సహాయకులు, ఏఎన్ఎంలు, ఎనర్జీ సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సమీక్షలు.. ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)

కొన్ని పంచాయతీలను విలీనం చేసి పదేళ్లు దాటిందని, అయితే పరిశుభ్రమైన తాగునీటిని అందించలేని పరిస్థితి ఉందన్నారు. గతంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి రుణాలు మంజూరై ఉన్నాయని, అయితే కొన్ని పనులు ప్రారంభించి నిలుపుదల చేశారన్నారు. ఆ పనులను కొనసాగించడమా.. అంచనాలను సవరించి కొత్తగా చేపట్టడమా అనే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ స్పందించి మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిధిలో భాగస్వామ్యమైన మంగళగిరి నియోజకవర్గానికి కూడా మౌలిక సదుపాయాల కల్పన పనులను పొడిగించాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనులు పూర్తి చేస్తామన్నారు.

సూచనలు.. లక్ష్యాలు

కలెక్టర్ల సదస్సు చివరి రోజున వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్లకు కొన్ని సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వచ్చే మూడున్నర నెలల్లో పీఎంఏవై అర్బన్ కింద 4200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గుంటూరు కలెక్టర్‌కు లక్ష్యాన్ని నిర్దేశించారు. పీఎంఏవై అర్బన్‌ని 2026 మార్చి వరకు కేంద్ర ప్రభుత్వం గడువు పొడిగించినందున సాధ్యమైనంత త్వరగా పెండింగ్ గృహాలు పూర్తి చేయాలన్నారు. గోకులాల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. అటవీ శాఖ క్లియరెన్స్‌లు జిల్లాలో ఏడు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణీకరణ వేగవంతంగా విస్తరిస్తున్నందున ప్రతీ ప్రాంతానికి మౌలిక సదుపాయాల కల్పనకు ఒక బ్లూప్రింట్ తయారు చేసి అమలు చేయాలన్నారు. కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్లానింగ్ చేసుకుని ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మంగళగిరిలో ఐటీ పార్కు నిర్మాణానికి 200 ఎకరాల భూమిని గుర్తించాలని ఆదేశించారు. అమరావతిని బుద్ధిస్టు సర్క్యూట్‌గా పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కూడా ప్రణాళిక రూపొందించాలన్నారు. మానవవనరులు, గృహ నిర్మాణం, చైల్డ్ వెల్ఫేర్, వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఇలా దాదాపు అన్ని విభాగాలలో బాపట్ల జిల్లాకు సంబంధించి సమీక్షలో చర్చించారు. రాబోయే నాలుగున్నరేళ్లలో ఆయా రంగాలలో సాధించాల్సిన పురోగతితో పాటు జిల్లాలో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉన్న వనరుల లభ్యత వంటి అంశాలన్నీ సదస్సులో చర్చకు వచ్చాయి

ఓఆర్ఆర్‌తో గుంటూరు - విజయవాడ - అమరావతి కలిసిపోతాయి

అమరావతి ఔటర్ రింగురోడ్డు డీపీఆర్‌ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2026 డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ ఔటర్ రింగురోడ్డు అభివృద్ధితో గుంటూరు, అమరావతి, విజయవాడ, వీటి మధ్య ఉన్న గ్రామాలు కలిసిపోతాయని సీఎం చెప్పారు. దీంతో పట్టణీకరణ పెరిగిపోతుందని, ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేసి ప్రాధాన్యక్రమంలో పనులను నిర్ణయించి, ఆ దిశగా వాటిని చేపట్టాలని సూచించారు.

వరప్రదాయినికి వీడిన గ్రహణం

సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా నిలిచే గోదావరి జలాల తరలింపు పథకానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. కూటమి ప్రభుత్వం ఈ పథకం నిర్మాణాన్ని పట్టాలెక్కిస్తూ కలెక్టర్ల సదస్సులో సీఎం నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టగా వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్మాణాన్ని నిలిపివేసింది. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి నీటిని అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. అయితే వైసీపీ ప్రభుత్వం నిధుల విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. నిర్మాణ వ్యయం రూ.6020 కోట్లు కానున్నది. 466 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ పథకం పూర్తి చేస్తే సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు మహర్దశ పడుతుంది. గోదావరి, పెన్నా అనుసంధానం కుడి కాల్వ ఆయకట్టుకు జీవం పోస్తుంది.

నీటి సంఘం ఏకగ్రీవం!

- రేపు ఎన్నికల ప్రక్రియ
- పీసీ చైర్మన్ పదవి కోసం మద్యం వ్యాపారి విశ్వప్రయత్నం

చీరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల ఎన్నికలను పాలకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. దాదాపు అన్ని కమిటీలు ఏకగ్రీవం అయ్యేందుకు కసరత్తు చేస్తున్నారు. ఏకగ్రీవం అయితే పంతాలు, పట్టింపులు ఉండకపోవడంతో పాటు, ప్రభుత్వ పరంగా ప్రోత్సాహక బహుమతి కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో పాలకులు అన్ని నీటి సంఘాలు, డీసీలు, పీసీ ఏకగ్రీవం అయ్యేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలో పీసీ (ప్రాజెక్టు కమిటీ) చైర్మన్ పదవి కోసం ఓ మద్యం వ్యాపారి విశ్వప్రయత్నం చేస్తున్నారు. సదరు వ్యాపారికి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి దక్కితే తన మద్యం వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు ప్రయత్నిస్తారా.. లేక రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయత్నిస్తారా అనే విషయంపై రాజకీయ వర్గాల్లోను, రైతుల్లో చర్చ జరుగుతోంది.

చీరాల, చినగంజాంలకు సంబంధించి రెండు డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ)లు ఉన్నాయి. చీరాల డీసీ పరిధిలో 8, చినగంజాం డీసీ పరిధిలో 9 నీటి సంఘాలు ఉన్నాయి. ఈ క్రమంలో దాదాపు అన్ని నీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యేందుకు ఇప్పటికే ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు ఆశావహులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పోటీలు లేకుండా ఏకగ్రీవాలు అయ్యేందుకు అనుసరించాల్సిన విధి, విధానాలను వారికి వివరించారు. ఏకగ్రీవం అయితే ఇటు సాగుపరంగా, అటు రాజకీయంగా ఒనగూరే ప్రయోజనాలను విశ్లేషించారు. దాదాపు అన్ని నీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యేందుకు అవకాశం ఉందని చెప్తున్నారు. ముందస్తుగా నీటి సంఘాల ప్రక్రియ పూర్తయితే వారు డీసీలను ఎన్నుకుంటారు. డీసీలకు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఉంటుంది. ఇదిలా ఉంటే శనివారం నీటి సంఘాల ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. పోటీలో పాల్గొనే వారికి ఫారం-4 ఇస్తారు. కమిటీ సభ్యులుగా పోటీకి ఒకరికి కన్నా ఎక్కువ నామినేషన్లు దాఖలు కాకుంటే, నామినేషన్ వేసిన వ్యక్తిని ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. పోటీ గనుక ఉంటే ముందుగా చేతులు ఎత్తి ఎన్నుకునే విధానంను అనుసరిస్తారు. కాదని ఎవరన్నా రహస్య ఓటింగ్ పద్ధతిని కోరుకుంటే, బ్యాలెట్ ఇస్తారు. అయితే దాదాపుగా చేతులు ఎత్తటం లేదా బ్యాలెట్ పద్ధతి రాకుండానే ఏకగ్రీవాలు అయ్యేందుకు కూటమి నేతలు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉంటే డీసీల నుంచి పీసీ(ప్రాజెక్టు కమిటీ)చైర్మన్ ఎంపికను కూడా ఏకగ్రీవం చేయాలో తలంపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈ పర్యాయం ఆయకట్టు చివరిభూములకు సంబంధించిన ప్రాంతపు వ్యక్తికి పీసీ చైర్మన్‌గా అవకాశం కల్పించే అవకాశం ఉందని చెప్తున్నారు. అందుకుగాను ఓ మద్యం వ్యాపారి పీసీ చైర్మన్‌గా తనపేరును ఖరారు చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సదరు మద్యం వ్యాపారి రైతు ప్రయోజనాలను కాపాడేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాడా, లేకుంటే ఈ పదవిని అడ్డుపెట్టుకుని తన మద్యం వ్యాపారంను విస్తృతం చేసుకునేందుకు పావులు కదుపుతాడా అన్న అంశం అటు రాజకీయ వర్గాల్లోను, ఇటు ఆయకట్టు పరిధిలోని రైతాంగంలోను చర్చ జరుగుతోంది.

ఆ దిశగా అడుగులు

అద్దంకి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వినియోదారుల సంఘాల ఎన్నికలు అత్యధికశాతం ఏకగ్రీవం దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 14వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఆయా గ్రామాలలో కూటమి నేతలు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతుండగా వైసీపీ నేతలు మాత్రం దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అత్యధిక శాతం సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అద్దంకి నియోజకవర్గంలో కామేపల్లి 2, ఏల్చూరు 2, కొప్పరం 1, తంగేడుమల్లి 2, కుందుర్రు 2, ఏల్చూరు 1, కొప్పరం 2, గొర్రెపాడు 1, కొప్పరం 3, కొణిదెన, ఉప్పమాగులూరు, చెన్నుపల్లి, గొర్రెపాడు 2, చినకొత్తపల్లి 1, వైదన, బల్లికురవ, చినకొత్తపల్లి, కలవకూరు, అద్దంకి1, కొండమంజులూరు 1, అద్దంకి 2,3,4 పంగులూరు 1, 2, మణికేశ్వరం, బొడ్డువానిపాలెం, రావినూతల, చందలూరు 1, దుద్దుకూరు, రామకూరు, చందలూరు 2, కొండమంజులూరు 2, కొటికలపూడి, రామాయపాలెం, మోదేపల్లి, తంగేడుమల్లి, కామేపల్లి 1 మేజర్ సాగునీటి సంఘాలకు, మైనర్ ఇరిగేషన్ పరిధిలోని అలవలపాడు, రాళ్లపల్లి, అద్దంకి-5, కలవకూరు 2, గొర్రెపాడు 3, కొణిదెన 3, నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి 2, సంతమాగులూరు, కొప్పరం 4, 5 ఏల్చూరు 3, కుందుర్రు 3 మైనర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయా సాగునీటి సంఘాల ఎన్నికలు ఏ క గ్రీ వం జరిగే విధంగా చేసేందుకు అధికార పార్టీ నాయకులు గ్రామాలవారీగా ఆశావహులతో చర్చిస్తున్నారు. ఇప్పటికే అత్యధికశాతం కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది. కొన్ని చోట్ల అధికార పార్టీలోనే పలువురు పోటీపడుతున్నప్పటికీ ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఎన్నిక జరగాల్సి వస్తే ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు అధికారులు చేపట్టారు.

భారీ వర్షాలు పడితే తీవ్ర నష్టమే

- వరి, మొక్కజొన్న కోతలు, నూర్పిళ్లు
- రైతుల్లో అల్పపీడనం ఆందోళన
- పంటలను కాపాడుకునే యత్నం



గుంటుపల్లిలలో వర్షాలు పడతాయని వరి నూర్పిడి చేస్తున్న రైతు

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బోరు బావుల కింద వరి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన అన్నదాతల్లో అల్పపీడనం దడ పుట్టిస్తోంది. భారీ వర్షాలు పడితే చేతికి వచ్చిన పంటలకు తీవ్ర నష్టాలు తప్పవు అని వారు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి ఉదయం నుంచే నల్లగా కారుమబ్బులు కమ్మడంతో రైతులు మరింత ఆందోళనలో ఉన్నారు. పొలాల మీద కొందరు రైతులు వరి పంటను కోత కోసి నూర్పిడి చేసేందుకు సిద్ధం అవుతుండగా కొందరు రైతులు కోత కోసి ఉంచారు. కొందరు కోత దశలో ఉన్న పంటను వర్షాలు లేకుంటే కోసేందుకు సిద్ధం అవుతున్నారు. మొక్కజొన్న, జూట్ పంటలు సాగు చేసిన రైతులు కోత దశలో పంట ఉందని ఇప్పుడు వర్షాలు పడితే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అంటున్నారు.

బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, గుంటుపల్లి, కొత్తపాలెం, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, కూకట్లపల్లి, కొప్పెరపాడు, గొర్రెపాడు, వెలమవారిపాలెం తదితర గ్రామాలలో రైతులు గత మూడు మాసాల కిందట బోరు బావుల నీటి ద్వారా వరి పంటను, మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఇప్పుడు పంటలు కోత దశలో ఉన్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో ఈ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే తమకు తీవ్ర నష్టాలు వస్తాయని ఆందోళనకు గురవుతున్నారు. కొందరు రైతులు వరి పంటను నూర్పిడి చేసేందుకు పనులు వేగవంతం చేస్తున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు పంటలను కాపడుకునే ప్రయత్నాలలో ఉన్నారు. భారీ వర్షాలు కురిస్తే వరి కంకులు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంట ఇంటికి వచ్చే సమయంలో భారీ వర్షాలు పడితే తమకు పెట్టుబడులు కూడా చేతికి రావని రైతులు తెలిపారు.



కోత దశలో ఉన్న వరి

మందులు.. ఏటిపాలు

(5వ పేజీ తరువాయి)

మందులు మిగిలిపోయినా, వాటిని పారేశారంటే అర్థం ఉంటుంది. కరోనా తర్వాత వస్తున్న రోగాలకు తగ్గ మందులన్నీ ఉన్నా, అవన్నీ మిగిలిపోవడం విడ్డూరమే. పారాసిట్‌మాల్, ఇతర యాంటీబయోటిక్స్, విటమిన్ డీ 3, గ్యాస్, షుగర్, బీపీ వంటి నిత్యావసర మందులు కూడా నదిలో పారేసిన వాటిలో ఉండటం విశేషం. ఇకటి, రెండు పీహెచ్‌సీల పరిధిలోనే ఇన్ని మందులు గడువు ముగిసిపోయినవి ఉంటే, రాష్ట్రం మొత్తం మీద ఇంకెన్ని ఉంటాయనేది ఆందోళన కలిగించే విషయం. బలానికి సంబంధించి, ఐరన్ వంటి పోషక విలువలు తగ్గిన వారికి ఉపకరించే విటమిన్ ట్యాబ్లెట్లు కూడా వృథా చేశారు. ఖరీదైన ఇంజక్షన్లు కూడా పారేసిన వాటిలో దర్శనమిస్తున్నాయి. చివరకు చిన్న పిల్లలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు కూడా ఉపయోగించలేదంటే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఈ మందులను ప్రభుత్వం సరఫరా చేసిన తర్వాత రెండు వేసవి సీజన్లు వచ్చాయి. ఆ సమయంలో డీహైడ్రేషన్‌తో ఆస్పత్రిపాలైన వారు ఎందరో ఉన్నారు. వారికి ఉపయోగపడే ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా నదిలో పారేశారు. ఇక నిరోద్ ప్యాకెట్లను కూడా పారేశారు.

సురక్ష అమల్లో నిర్లక్ష్యం

జగన్ ప్రభుత్వ కాలంలో పేదల కోసం అంటూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారు. 2023 సెప్టెంబరులో సర్వే, మెడికల్ క్యాంపులు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నారు. దీనిలో వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ రెండుసార్లు తిరిగి, సర్వే, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలి. దీనికోసం 104 వాహనాన్ని ఉపయోగించుకున్నారు. చికిత్స అవసరం అనుకుంటే శిబిరాల్లో పరీక్షించి, మందులు అందేలా చూడాలి. అయితే ఇవేమీ అన్నిచోట్ల ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం జరగలేదు. దీంతో మందులన్నీ మూలన పడేశారు. పైగా 2023లో పథకం అమలు జరిపితే, దానికి అవసరమైన మందులను 2022 చివరలో తయారు చేసినవి సరఫరా చేశారు. అవికూడా 2023-24లో గడువు పూర్తయ్యే సమయంలో వాటిని నాటి ప్రభుత్వం కొనుగోలు చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోనీ వాటినైనా గడువు ముగిసేలోపు రోగులకు అందించారా అంటే అదీ లేదు. జ్వరం, యాంటీబయోటిక్స్ ట్యాబ్లెట్లు అందించలేకపోయారంటే ఏదో సాకు చెప్పవచ్చు. కానీ వాక్సిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కోవిడ్ ర్యాపిడ్, మలేరియా ర్యాపిడ్ టెస్ట్‌ల కిట్లు కూడా ఏటిపాలు చేశారంటే ఈ పథకం అమలులో ఎంత నిర్లక్ష్యం రాజ్యమేలిందనేది అర్థమవుతుంది. గడువు ఉన్నప్పుడు ప్రాణాలు కాపాడే మందులు గడువు తీరాక విషంతో సమానం. ప్రమాదకర పరిస్థితులు కలిగించే మందులను, సెలైన్ సీసాలను నదిలో పారేయడం దారుణం. అవి నదిలో కొట్టుకుపోయి నీరు కలుషితమవుతుంది. తాగిన జంతువులు, మనుషులు హాని కలిగే అవకాశం ఉంది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా మందులను నదిలో పారేయడంపై సమీప గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర నివేదిక

- వెలిగొండ పూర్తి - డెయిరీ పునరుద్ధరణ
- ట్రిపుల్ ఐటీ, ఏకే వర్సిటీ పూర్తి వంటి

కీలక అంశాలు ప్రభుత్వం దృష్టికి : కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఐదేళ్లలో జిల్లా ప్రగతి ప్రణాళికలతో పాటు అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మౌలిక రంగాలకు సంబంధించిన కీలక అంశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

రెండురోజుల పాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో రెండవ రోజైన గురువారం రాత్రి జిల్లా విజన్ ప్రణాళిక-29పై వివరించే అవకాశం ఆమెకు లభించింది. ప్రణాళికలు బాగా రూపొందించిన మూడు జిల్లాల్లో ఒకటిగా జిల్లాగా ఎంపిక కావడంతో సంబంధిత అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సదస్సులో ఇచ్చారు. కొద్దిపాటి సమయమే దక్కగా అధిక భాగం నివేదిక రూపంలో ఇచ్చారు. అందులో ప్రధానంగా ప్రస్తుతం జిల్లా ఉన్న స్థూల ఉత్పత్తి రూ. 50,350 కోట్లు, తలసరి ఆదాయం రూ.1,97,357 కోట్ల నుంచి 2029 నాటికి స్థూల ఉత్పత్తి రూ.1,14,712 కోట్లు, అలాగే రూ.4.27 లక్షల తలసరి ఆదాయం పెరిగేలా చేయడానికి లక్ష్యం నిర్దేశం, దాని సాధన కోసం అనుసరించాల్సిన వ్యూహాలను పేర్కొన్నారు.



వెనుకబడి

- ప్రభుత్వ పాఠశాలల పనితీరు దారుణం
- ఒక్క దానికీ దక్కని ఫైవ్ స్టార్ రేటింగ్
- కొన్ని నాలుగు స్టార్లకే పరిమితం
- మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్భాటం తప్ప విద్యను పట్టించుకోకపోవడమే కారణం

ప్రభుత్వ బడులు విద్యలో వెనుకబడిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామంటూ చెప్పినదంతా ఆర్భాటపు ప్రచారమనేది తేటతెల్లమైంది. కొన్ని స్కూళ్లల్లో సదుపాయాలు ఉంటే ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న కొన్నిచోట్ల వసతులు అంతంతమాత్రంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఈ రెండు లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన పాఠశాలలు ఒక్కటి కూడా జిల్లాలో లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై విద్యాశాఖాధికారులు దృష్టిసారించారు. ఆర్జేడీ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టారు.

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా చేపట్టిన అధ్యయనంలో ప్రభుత్వ పాఠశాలలల్లో వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాలు(లెర్నింగ్ అవుట్ కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ పాఠశాల ఏ స్థాయి ఉంది? అనే అంశంపై వివరాలు సేకరించడంతో ఇప్పటి వరకు వైసీపీ ప్రభుత్వం చేసిన నాడు-నేడు పథకం పేరుతో చేసిన హడావుడి అంతా ఉత్తదేనని తేలిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ఫైవ్ స్టార్లు, అభ్యసర ఫలితాలకు ఫైవ్ స్టార్లు ప్రామాణికంగా తీసుకొని జిల్లాలో ఈ అధ్యయనం చేశారు.

నాడు-నేడు అంతా హడావుడే

జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 2,406 ఉండగా వాటిలో ఏ ఒక్క పాఠశాలకు కూడా కనీస విభాగంలో ఫైవ్ స్టార్ వచ్చిన పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిగా దీటుగా అభివృద్ధి చేసినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారం చేసుకుందే తప్ప వాటి అభివృద్ధిని పట్టించుకోలేదు. నాడు-నేడుతో పాఠశాల స్వరూపాన్నే మార్చామని జగన్మోహన్‌రెడ్డి పదే పదే చెప్పుకోవడం తప్పా ఆచరణలో అభివృద్ధి చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన అధ్యయనంలో స్టార్ రేటింగ్ ఫలితాల్లో 5 స్టార్ ఫలితాలు వచ్చిన పాఠశాలలు ఒక్కటి లేదు. 4 స్టార్ ఫలితాల్లో కేవలం 439 పాఠశాలలు ఉండగా అభ్యసనలో 4 స్టార్‌లో నాలుగు పాఠశాలలు ఉన్నాయంటే పాఠశాలల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్టార్ రేటింగ్ ఇలా

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడామైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ తరగతి గదులు, తాగునీరు తదితర అంశాలను పరిశీలించారు. ఒక్కొక్క అంశానికి ఐదు చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన పాఠశాలలకు ఫైవ్ స్టార్లు కేటాయించగా 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్‌ను ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గత ఏడాది పదవ తరగతి పరీక్ష ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదవ తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకొని ఈ అధ్యయనం చేశారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40శాతం, ఫలితాలకు 60శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండు కలిపి 90శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలు ఉన్న పాఠశాలలకు ఒకటి నుంచి నాలుగు స్టార్లు కేటాయించారు.

ఆర్భాటంతో బోధన నిర్వీర్యం

గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలలను రాజకీయ ప్రచారానికి వాడుకుందనేది ఇప్పుడు బహిర్గతమైంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్వీర్యం చేసిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్లుగా మార్చేసి ఫలితాలను దిగజార్చిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

బోగస్ రోల్‌ను తొలగించాలి

- పాఠశాలల పనితీరును మెరుగుపర్చాలి
- ముగ్గురు సస్పెన్షన్‌కు ప్రతిపాదనలు పంపాలి
- డీఈవోకు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశం

పాఠశాలల్లో బోగస్ ఎన్‌రోల్‌మెంట్ ఉంటే వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గుంటూరు విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో గురువారం ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాజరు సక్రమంగా లేని విద్యార్థులను చివరి వరకు ఉంచి బోగస్ ఎన్‌రోల్ చేయడం సరికాదన్నారు. స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోగస్ ఎన్‌రోల్ ఉంటే శుక్రవారం సాయంత్రంలోపు తొలగించాలన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. వరుసగా 30రోజులు బడికి రాని విద్యార్థులను డ్రాప్ అవుట్స్ లిస్టులో చేర్చాలన్నారు. తరుచుగా బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మాట్లాడాలని ఆదేశించారు. పాఠశాలలోని హాజరు రిజిస్టర్‌లో విద్యార్థుల సంఖ్యకు, యూడైస్ సైట్‌లోని సంఖ్య సరిపోయే విధంగా ఉండాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల హాజరు 75శాతం ఉండాలన్నారు. వారు హాజరయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత సంబంధిత హెచ్‌ఎంలపై ఉందన్నారు. ఇప్పటి వరకు 604 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫీజు చెల్లించలేదన్నారు. వారందరూ పరీక్ష ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్‌జీపాడు ఎంఈవోలు, హెచ్‌ఎంపై చర్యలు

గత నెలలో తాను నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ హైస్కూలును సందర్శించానని, అయినా ఈ రోజుకు పొల్యాబ్ 0.04శాతంగానే ఉందన్నారు. తాను స్వయంగా పరిశీలించిన తర్వాత కూడా మెరుగుపర్చకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే క్యాంపస్‌లో మండల విద్యాధికారి కార్యాలయం కూడా ఉందని, అయినా తగిన విధంగా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవోలు ఇద్దరు, ఎన్‌జీపాడు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎంలను సస్పెండ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని డీఈవో కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. గిద్దలూరు, వైపాలెం ప్రాంత మండలాలకు మార్కాపురంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పాఠశాలల్లో ఆట స్థలానికి రూ.5లక్షలు గతంలో మంజూరు చేశామని, వెంటనే ఆ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్ష చేసి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డీఈవో ఏ.కిరణ్‌కుమార్, డీసీబీఈ సెక్రటరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొలువుదీరనున్న శ్రీ వేణుగోపాలస్వామి

- కొండమంజులూరు గ్రామస్థులు, దాతల విరాళాలతో పునర్ నిర్మితం
- 23న వైభవంగా ప్రతిష్ఠోత్సవం




కొండమంజులూరులో పునర్ నిర్మాణమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం

శ్రీ వేణుగోపాల స్వామి మూలవిరాట్

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో రూ.2 కోట్ల 40 లక్షల వ్యయంతో పునర్ నిర్మాణమైన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం శిఖర గోపురాలు, వాటిపై రూపుదిద్దుకున్న, దేవతామూర్తుల రాతి చిత్రాలతో ఆధ్యాత్మిక శోభ సోభిల్లుతుంది.

దాతలు, గ్రామస్థుల సహకారంతో ఈ ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. 2018లో గ్రామస్థులు 13 లక్షల 40 వేల రూపాయల మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించగా, నాటి ప్రభుత్వం రూ.26 లక్షల 60వేల సీజీఎఫ్ నిధులను మంజూరు చేసింది. భూ మి పూజ అనంతరం 2019లో ప్రారంభమైన నిర్మాణ పనులు పూర్తయ్యా యి. ఐదేళ్ల కాల వ్యవధిలో పలువురు దాతలు, గ్రామస్థులు అందించిన భూరి విరాళాలతో శోభాయమానంగా రూపుదిద్దుకున్న ఈ ఆలయంలో ఈనెల 23న దేవతామూర్తులను శాస్త్రోక్తంగా కొలువు దీర్చేందుకు ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది.



శిథిలమైన విజయనగర రాజుల నాటి ఆలయం (ఫైల్)

దాతల భూరి విరాళాలతో

కొండమంజులూరు గ్రామంలో 16వ శతాబ్దంలో ఆ నాటి విజయనగర రాజులు రుక్మిణీసత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు మకర తోరణాల కింద అంత్రాలపై లిఖితమైన ఆనవాళ్లున్నాయి. ఎంతో ప్రాచుర్యం ఉన్న ఈ ఆలయం శిథిలావస్థకు చేరింది. దీంతో 2018లో గ్రామస్థులు ఆలయ పునర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రానైట్ రాతి కట్టడంతో నిర్మించ తలపెట్టిన ఆలయానికి గర్భగుడికి అవసరమైన గ్రానైట్ రాయిని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమకూర్చారు. గుడిపై గోపుర నిర్మాణానికి విశ్రాంత రెవెన్యూ అధికారి కరణం లింగారావు రూ.14లక్షలు, ముఖ మండప నిర్మాణానికి గ్రామానికి చెందిన రావులవారి వంశస్తులు రూ.41లక్షల నిధులు సమకూర్చారు. ఆలయం మందు భాగంలో శోభాయమానంగా రూపు దిద్దుకున్న రాజగోపుర నిర్మాణానికి ప్రవాసాంధ్రులు, గ్రామవాసి చింతల రమేష్ రూ.25లక్షలు విరాళంగా అందచేశారు. ఆలయ ముందు భాగంలో నిర్మితమైన గరుత్మంతుని గుడి ఏర్పాటుకు కరణం కోటేశ్వరరావు, పున్నారావు రూ.8లక్షల నిధులు సమకూర్చగా, ఆలయ ధ్వజ స్తంభ నిర్మాణానికి విశ్రాంత ఉపాధ్యాయులు బత్తుల బాపయ్య రూ.8లక్షల నిధులను అందచేశారు. దేవతా మూర్తుల విగ్రహాలకు గుంటుపల్లి శ్రీకాంత్ రూ.6లక్షలు, ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చింతల సహదేవుడు రూ.10లక్షలు, రావుల రామకృష్ణ 2 లక్షలు నిధులు సమకూర్చారు. గ్రానైట్ వ్యాపారి వేములపల్లి శ్రీనివాసరావు, ఆలయంలో స్టోర్ రూము నిర్మాణానికి రూ.5లక్షల విరాళాన్ని బొప్పూడి నాగేశ్వరరావు,ఎడవల్లికి చెందిన ఇన్నమూరి శ్రీనివాసరావు సత్యవాణి, గుండవరపు వెంకట ప్రసాద్, మండవ కృష్ణమూర్తితో పాటు గ్రామస్థులు అందించిన సుమారు రూ.35లక్షల భూరి విరాళాలతో ఆలయ నిర్మాణం చకచకా పూర్తయినట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్మాణ పర్యవేక్షకులు దొప్పలపూడి వీరయ్య తెలిపారు. కొండమంజులూరు కొండకు దిగువన తూర్పు దిక్కుగా సుందరంగా నిర్మితమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్ నిర్మాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈనెల 23వ తేదీన శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ పునర్ నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ



16వ దశాబ్దంలో కొంమంజులూరు గ్రామంలో నిర్మితమైన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో స్వామి వారికి పూజా కైంకర్యాలు, నిత్య నైవేద్య నిర్వహణకు కొంత కాలంగా ఇబ్బందిగా అనిపించేది. తమ వంశస్తులు తరతరాలుగా ఆలయంలో కొలువు దీరిన శ్రీ వేణుగోపాలస్వామి వారికి సేవ చేసే భాగ్యం ప్రసాదించిన సాక్షాత్తు ఆ మహా విష్ణువు భక్తుల మదిలో కొలువుదీరి, గ్రామస్థులను ఆలయ పునర్ నిర్మాణానికి పురికొల్పాడనే భావన కలుగుతుంది. ఆలయం సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నిర్మాణంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

\- ముప్పాళ్ల శ్రీనివాస్, ఆలయ అర్చక స్వామి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి పూజలు

వేటపాలెం, చీరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దత్త క్షేత్రంలో దత్తజయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం భక్తులు దత్త క్షేత్రంలోని శ్రీరామ యంత్ర క్షేత్రంలో తాము రాసిన రామకోటి ప్రతులను నిక్షిప్తం చేశారు. అనంతరం దత్తయజ్ఞం, పంచదత్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1008 సార్లు సిద్ధ మంగళ స్తోత్రాన్ని పారాయణం చేవారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ప్రతి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ 15వ తేదీ ఆదివారం దత్త జయంతి పర్వదినాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. శ్రీవేంకటేశ్వర కోలాట భక్త బృందం దత్త మందిరం, రామభక్త హనుమాన్ మందిరంలలో నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రమీలదేవి, చుండూరి లక్ష్మి, కరణం మురళీకృష్ణ, గుర్రం రంగనాయకులు, కన్నయ్య, రాంబాబు, వెంకట్రావు, చంద్ర, చంద్రకళ, రమాదేవి, భువనేశ్వరి, రాజేశ్వరి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ఇంకొల్లు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు వెంటనే బకాయి చెల్లించాలని స్త్రీనిధి ఏజీఎం నాగబాబు ఆదేశించారు. వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం సహాయకులకు సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏజీఎం నాగబాబు మాట్లాడుతూ ఇంకొల్లు మండలానికి రూ.4కోట్ల 50లక్షల స్త్రీనిధి రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మండలంలో మొండి బకాయిలను వెంటనే చెల్లించినట్లయితే తిరి గి రుణాలు పొందవచ్చన్నారు. ఇడుపులపా డు గ్రామంలో ఎక్కువ రుణ బకాయిలు ఉన్నాయని వాటి రికవరీపై సిబ్బంది దృష్టి సారించాలని ఏపీఎం అనూరాధను ఆదేశించారు. బకాయి ఉన్న ప్రతి గ్రూపు సభ్యురాలికి మండల సమాఖ్య నుంచి నోటీసులు జారీ చేయాలని సూచించారు. తీసుకున్న రుణాలతో జీవనోపాధి అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామ సహాయకులు, సీసీలు డి.అశోక్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై నిఘా

- అధికారుల ఆకస్మిక తనిఖీ
- 63 మందిపై కేసులు, రూ.3,18,000 అపరాధ రుసుం విధింపు



తనిఖీలపై విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ మస్తానరావు, డీఈ

మార్టూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందచేస్తున్నామని, అయితే విద్యుత్ శాఖను మోసం చేస్తూ నిబంధనలును ఉల్లంఘించే వారిపై నిఘాను పెంచాలని విద్యుత్ శాఖ అద్దంకి ఈఈ ఎస్.మస్తాన్‌రావు విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం మార్టూరులో విద్యుత్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు గ్రానైట్ పరిశ్రమలను, వ్యాపారవర్గాలు, పలు వినియోగదారుల గృహాలను తనిఖీ చేసి విద్యుత్ అక్రమ వినియోగం, అధికలోడు, కరెంటు మీటర్ల వినియోగం తదితర అంశాలను వారు తనిఖీ చేశారు. వారిలో నిబంధనలను ఉల్లంఘించిన 63 మందిపై కేసులు నమోదు చేసి, వారిపై రూ.3,18,000 అపరాధ రుసుంతో కేసులు నమోదుచేసినట్లు ఈఈ మస్తానరావు తెలిపారు. ఈ తనిఖీలలో ప్రత్యేకంగా 30 మందితో కూడిన అధికారుల బృందం పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయం వద్ద ఈఈ మస్తాన్‌రావు తనిఖీ అధికారులతో కలిసి మాట్లాడారు. గ్రామాలలో విద్యుత్ అక్రమ వినియోగం చేసే వారిపై చర్యలు ఉంటాయని, ఈ విషయంపై వినియోగదారులకు అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో మార్టూరు డీఈఈ ఎం.సురేంద్రబాబు, అద్దంకి డీఈఈ ఎం.దామోదరరాజుతో పాటు అద్దంకి డివిజన్‌లోని పలువురు మండల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జొన్నతాళిలో రూ.20లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



బీసీకాలనీలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ నాగేంద్రమ్మ, పంచాయతీ అధికారులు

మార్టూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో తొలుత జొన్నతాళి గ్రామ పంచాయతీలో రెండు సీసీ రోడ్లు నిర్మాణం పూర్తయ్యాయి. వాటిలో ఎస్టీ కాలనీలో సైడు కాల్వలతోపాటు సీసీ రోడ్డు నిర్మాణం, అదేవిధంగా బీసీ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యాయి. గ్రామ పంచాయతీ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కలిపి రూ.20లక్షల వ్యయంతో పంచాయతీ సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించారు.దాంతో గతంలో ఈ రెండు కాలనీల్లో ముఖ్యంగా వర్షాకాలంలో అధ్వాన్నంగా, బురదమయంగా ఉండే మట్టిరోడ్ల స్థానంలో సీసీ రోడ్ల నిర్మాణం జరగడం పట్ల కాలనీల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నీటి సంఘం ఎన్నికపై సిబ్బందికి సూచనలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్నికల అధికారి సుమంత్

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 14న జరుగనున్న ఎన్ని కలకు సంబంధించి పంగులూరు - 2 నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల అధికారి సుమంత్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది 14వ తేదీ ఉదయం 8 గంటలలోపే ఆయా పోలింగ్ కేంద్రాలకు చే రుకోవాలన్నారు. నిర్ణీత వ్యవధిలో పోటీ చేసే ఆసక్తి గల రైతుల నుంచి నామినేషన్లు స్వీకరించడం, వాటి పరిశీలన, ఉపసంహరణ కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రక్రియ సాయంత్రం 5 గంటలలోపు పూర్తి చేసేందుకు సిబ్బంది ఎన్నికల నిర్వహణాధికారికి సహకరించాలని కోరారు. నిబంధనల మేరకు ఎన్నిక నిర్వహించడంతో పాటు ఓటర్లతో సమన్వయంతో వ్యవహరించి ఎన్నిక ప్రక్రియ శాంతియుతంగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్, ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి



కల్లంవారిపాలెంలో తహసీల్దార్ సింగారావుకు అర్జీలు అందజేస్తున్న రైతులు

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి అన్నా రు. మండలంలోని రామకూరు, కల్లంవారిపాలెం గ్రామాలలో గురువారం తహసీల్దార్ సింగారావు పర్యవేక్షణలో రెవెన్యూ సదస్సు ను నిర్వహించారు. రామకూరులో ఆర్‌వోఆర్‌కు సంబంధించి 31, ఎఫ్‌లైన్ కోరుతూ 6, 22-ఎ(1) సి-1, కల్లంవారిపాలెం గ్రామ సదస్సులో ఆర్వోఆర్-4, ఎఫ్‌లైన్‌కు 7 దరఖాస్తులు అందగా, నాలుగు సమస్యలు సదస్సులోనే పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపా రు. కార్యక్రమంలో కల్లంవారిపాలెం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, చినఆదిరెడ్డి, గుడిపాటి సుబ్బారెడ్డి, రామకూరు ఉప సర్పంచ్ అశోక్, సర్వేయర్ సురేష్, ఆర్ఐ బాపయ్య, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : గ్రామాలలో ఉన్న రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. గురువారం మండలంలోని నక్కబొక్కలపా డులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా నక్కబొక్కలపాడు గ్రామ ప్రజలు శివాలయానికి వెళ్లేందుకు దారి అక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. ఈ సభలో ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, సర్పంచ్ ధూళిపాళ్ల బుల్లిరామయ్య పాల్గొన్నారు.

చినగంజాం : సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌ల కోసం 12, భూ సర్వేకు నాలుగు, అండగల్ 1బీ కోసం రెండు అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్బారావు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రెవెన్యూ సదస్సులో సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య కోరారు. గురువారం చెరుకూరు, కొత్తపాలెంలో జరిగిన సదస్సుల్లో ఆయన 11 అర్జీలను స్వీకరించారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

ప్రత్యేక ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ప్రణాళికల ద్వారా గ్రామాలను అభివృద్ధి పరచుకోవాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎల్ఎస్‌డీజీఎస్‌పై పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీలకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో అభివృద్ధి పనులను చేసుకోవాలన్నారు. ప్రజలందరూ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అవుతాయన్నారు. ప్రజలకు ఉపయోగ పడే పనులను గుర్తించాలన్నారు. అలానే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులను ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమతి, ఐసీడీఎస్ సీడీపీవో సుధ, వైద్యాధికారి రవితేజ పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఒక్కొక్కరికీ రూ.3వేల జరిమానా

వేటపాలెం, చీరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 216 జాతీయ రహదారిలో బచ్చులవారిపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం తహసీల్దార్ పార్వతి సిబ్బందితో కలసి నిర్వహించిన అకస్మిక తనిఖీలలో అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈక్రమంలో తహసీల్దార్‌తో అక్రమార్కులు ఒకింత వాదనకు దిగారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలు నేరమన్నారు. అలాంటి చర్యలను ఉపేక్షించమని తహసీల్దార్ పార్వతి హెచ్చరించారు. ఒక్కొక్కరికీ రూ.3వేల చొప్పున ముగ్గురికి రూ.9వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు దీవెనలు ప్రజలందరిపై ఉండాలని తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుంటుపల్లి గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల పాస్టర్ల సంఘ సమావేశం జరిగింది. సమస్యలను అధికారులకు వివరించారు. ముందుగా కేకును కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను పాస్టర్లకు అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, గుంటూరుకు చెందిన పాస్టర్ కిషోర్, పాస్టర్లు శ్యాంబాబు పాల్గొన్నారు.

పాస్టర్ల సంఘ మండల కమిటీ ఎన్నిక

మండల పాస్టర్ల సంఘం అధ్యక్షుడిగా కె.శ్యాంబాబు, ఉపాధ్యక్షుడిగా ఎం.యోహోన్, జి.యోహోన్‌లను పాస్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం నూతన కమిటీ రానున్న రోజుల్లో పాస్టర్ల సమస్యలపై ముందుంటామని తెలిపారు.

నిలిపి ఉన్న లారీలలో డీజిల్ చోరీ

ఆందోళనలో యజమానులు

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ ప్రాంతంలో గ్రానైట్ ముడిరాయి రవాణా చేసే లారీలు అధికంగా ఉన్నాయి. ఈ లారీలపై కన్నేసిన కొందరు దొంగలు రాత్రిపూట డీజిల్ చోరీలకు పాల్పడుతున్నారు. నాలుగు రోజుల వ్యవధిలోనే మల్లాయపాలెం, వీర్లకొండ, బల్లికురవ గ్రామాల పరిధిలో రాత్రుళ్లు నిలిపి ఉన్న ఆరు లారీలలో రూ.లక్షల విలువ చేసే డీజిల్‌ను చోరీ చేశారు. లారీలలో డీజిల్ ట్యాంకులు ఖాళీగా ఉండడం చూసి యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఎవరో కావాలనే చోరీలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. అత్యధికంగా లారీలు ఉండడంతో అవి పెట్టేందుకు సరైన స్థలం లేక కొందరు యజమానులు రోడ్ల వెంబడి లారీలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్‌ను చోరీ చేస్తున్నారు. ట్యాంకులకు పైపులు ఏర్పాటు చేసి డీజిల్‌ను లాగేస్తున్నారని యజమానులు వాపోతున్నారు. చోరీలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని లారీల యజమానులు పోలీసులను కోరుతున్నారు.

రైలు నుంచి జారి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐ మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చింతల శ్రీకాంత్ (30) బుధవారం రాత్రి రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడి నెల్లూరు సమీపంలో మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. కొమ్మినేనివారిపా లెం గ్రామానికి చెందిన చింతల వెంకయ్య రెండో కుమారుడు చింతల శ్రీకాంత్ బుధవారం తన ఇంటి నుంచి తిరుపతి బయలుదేరి ఒంగోలులో రైలు ఎక్కాడు. నెల్లూరు సమీపానికి రైలు వెళ్లగానే ప్రమాదవ శాత్తు శ్రీకాంత్ కది లే రైలు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీకాంత్ కొంత కాలం నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. శ్రీకాంత్ రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని రైల్వే పోలీసులు వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. గురువారం నెల్లూరు నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. శ్రీకాంత్‌కు వివాహం కాలేదు.

తోటవారిపాలెంలో దెబ్బతిన్న మొక్కజొన్న

- ఎరువుల దుకాణ యజమాని, రైతుల మధ్య వాదన
- విచారణ చేపట్టిన అధికారులు

చీరాలటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెంలో సుమారు 4.50 ఎకరాల మొక్కజొన్న పైరు దెబ్బతింది. దీంతో రైతులు ఎరువుల దుకాణ నిర్వాహకుడిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తోటవారిపాలెం అంబేద్కర్‌నగర్‌లో గుమ్మడి రత్నం 2.50 ఎకరాలు కౌలుకు మొక్కజొన్న సాగు చేశారు. అలాగే మరో ఇద్దరు కూడా రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. ఇప్పటికి పంట వేసి సుమారు 45 రోజులు గడుస్తుంది. అయితే ఈనెల 6వ తేదీన రైతులు ఈపూరుపాలెంకు చెందిన జ్యోతి ఫెర్టిలైజర్స్ వద్ద పురుగు మందులను కొనుగోలు చేసి చేనులో చల్లారు. వారం తిరగకముందే 4.50 ఎకరాల పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఎరువుల దుకాణదారుడు సరైన మందులు ఇవ్వలేదని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం తహసీల్దార్ గోపీకృష్ణ, వ్యవసాయాధికారి సుమతి విచారణ చేపట్టారు. రెండు వర్గాలను అధికారులు విచారించారు. అయితే రైతులు మినుము పంటకు మందులు అడిగారని ఫెర్టిలైజర్స్ నిర్వాహకుడు చక్కా శ్రీనివాసరావు చెప్తుండగా, మొక్కజొన్న పంటకే మందులు అడిగామని రైతులు అంటున్నారు. ఈ విషయమై రెండురోజులుగా పంచాయితీ సాగుతోంది.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు